ఈనాడు ప్రకాశం
గురువారం 3 అక్టోబరు 2024

నేటి నుంచి దసరా ఉత్సవాలు




విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా ఉన్న ఆలయాలు వేడుకలకు ముస్తాబయ్యాయి. త్రిపురాంతకంలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం బాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో గురువారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకు వివిధ రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 3న అమ్మవారిని బాలాత్రిపురసుందరీదేవిగా అలంకరిస్తారు. 4న హంస వాహనంపై బ్రహ్మచారిణి రూపంలో, 5న వ్యాఘ్ర వాహనంపై చంద్రఘటా దేవిగా, 6న శేష వాహనంపై కూష్మాండ దుర్గగా, 7న మయూర వాహనంపై స్కంద మాతగా కనిపిస్తారు. 8న సింహ వాహనంపై కాత్యాయినీ దేవిగా, 9న గజ వాహనంపై కాళరాత్రిగా, 10న నంది వాహనంపై మహా దుర్గాదేవిగా, 11న అశ్వ వాహనంపై శిద్ధిదాయినీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. 12న బలిహరణ, కుంభం, కూష్మాండ బలి, పూర్ణాహుతి పూజలు చేస్తారు.

– న్యూస్‌టుడే, త్రిపురాంతకం



బాలాత్రిపురసుందరీదేవి(అంతర చిత్రం) ఆలయంలో భక్తుల సందడి





పండ్లతో అలంకరించిన ఒంగోలు మండలం పెళ్లూరులోని జ్వాలాముఖి అమ్మవారి ఆలయం

డోలా.. స్వచ్ఛతా సేవలు భళా

పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతున్న సింగరాయకొండ మండలం పాకల తీర ప్రాంత శుభ్రతకు మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి కదిలారు. ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన కార్యక్రమంలో పీఎన్‌సీఏ డిగ్రీ కళాశాల, పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి స్వచ్ఛతా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. తాను స్వయంగా చెత్త ఏరుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉద్బోధిస్తూ విద్యార్థులు, గ్రామస్థులను ఉత్సాహపరిచారు.

– న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం, కొండపి గ్రామీణం, టంగుటూరు





మహాత్ముని స్ఫూర్తి.. జిల్లా అభివృద్ధికి కృషి



ఒంగోలు గ్రామీణం, ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: మహాత్ముని స్ఫూర్తితో జిల్లా, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేయనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఒంగోలు గాంధీరోడ్డులోని ఆయన విగ్రహానికి మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తదితరులు బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శిథిలావస్థలో ఉన్న చావిడి భవనాన్ని పరిశీలించారు. నూతన భవన నిర్మాణానికి అవసరమైన నిధులను ఎంపీ ల్యాండ్ నుంచి ఇవ్వనున్నట్లు మాగుంట తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎన్.లక్ష్మానాయక్, ఆర్డీవో సుబ్బారెడ్డి, తహసీల్దార్ వాసు తదితరులు పాల్గొన్నారు.

◗ ఒంగోలు ఆదర్శ పాఠశాల విద్యార్థులు బాపూజీలుగా మారారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని మహాత్ముని వేషధారణలో నగర వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల నుంచి గాంధీరోడ్డులోని బాపూజీ విగ్రహం వరకు సాగిన ఈ ప్రదర్శన ఎంతగానో ఆకట్టుంది.



బాపూజీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎంపీ మాగుంట తదితరులు

జగన్నాటకంలో సమిధలు

◗ ఎన్నికల వేళ హడావిడి ప్రారంభాలు
◗ ఇప్పటికీ పత్తాలేని మార్కుల జాబితాలు
◗ విద్యార్థుల జీవితాలతో ఆంధ్రకేసరి ఆటలు

గత సార్వత్రిక ఎన్నికల వేళ ఓట్ల కోసం వైకాపా ప్రభుత్వం ఆడిన నాటకాల్లో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం(ఏకేయూ) ప్రారంభం ఒకటి. భవనాలు లేకుండా.. నిర్వహణకు నిధులివ్వకుండా.. పనిచేయడానికి సిబ్బందిని కేటాయించకుండానే విశ్వవిద్యాలయాన్ని హడావిడిగా ప్రారంభించేసింది. రోజులు గడిచేకొద్దీ నిర్వహణలోని డొల్లతనం, లోపాలు ఇప్పుడు బహిర్గతమవుతున్నాయి. విద్యాపరంగా తీసుకుంటున్న నిర్ణయాలు, అనుసరిస్తున్న విధానాలు, అవసరమైన పత్రాల జారీలో చోటుచేసుకుంటున్న జాప్యంతో విద్యార్థులు ఇప్పుడు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. – న్యూస్‌టుడే, ఒంగోలు నగరం



ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం

◗ **చావు కబురు చల్లగా...:** సాంకేతిక కళాశాలల్లో బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు.. నేరుగా డిగ్రీ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చు. దీనిని లేటరల్ ఎంట్రీగా పిలుస్తారు. జిల్లాలోనూ పలువురు ఇదే తరహాలో ప్రవేశాలు పొందారు. ఆ విద్యార్థులు ఇప్పుడు నేరుగా మూడో సెమిస్టర్ పరీక్షకు సిద్ధం కావాల్సి ఉంది. ఇంతవరకు బాగానే ఉంది. అయితే విశ్వవిద్యాలయ అధికారులు మాత్రం లేటరల్ ఎంట్రీ వారికి ఈ ఏడాది రిజిస్ట్రేషన్ చేయడం లేదంటూ చావు కబురు చల్లగా చెప్పారు. దీంతో పలువురి భవితవ్యం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. అదే విషయం ప్రారంభంలోనే తెలిపి ఉంటే విద్యార్థులు అసలు చేరేవారు కాదు.

◗ **గొప్పలు సరే.. జాబితాలేవీ..!:** ఏకేయూలో ఇప్పటికి రెండు సెమిస్టర్ల పరీక్షలు నిర్వహించినట్లు గొప్పగా చెప్పారు. త్వరలో మూడో సెమిస్టర్ నిర్వహించనున్నారు. మొదటి సెమిస్టర్ పరీక్ష 2023 నవంబర్‌లో నిర్వహించగా ఇంతవరకు అసలు మార్కుల జాబితాలు విద్యార్థులకు అందజేయలేదు. ఫలితాలు ఆన్‌లైన్‌లో ఉంచారు. తాము ఉత్తీర్ణులయ్యామా లేదా అనేది చూసుకోవడం తప్ప చేతికి పత్రం అందలేదు. ఆన్‌లైన్‌లోనూ కొన్ని రోజులే ఉంచి ఆ తర్వాత తొలగించారు. ప్రస్తుతం ఆ వెబ్‌సైట్‌లో వివరాలేవీ లేవని చూపుతుండటం గమనార్హం. ఈ పరిస్థితితో పలువురు ఇబ్బందులు పడుతున్నారు. యూనివర్సిటీ అధికారులు మాత్రం నూతన విద్యా విధానం ప్రకారం డీజీ లాకర్ విధానం అమలులోకి వస్తుందని, పది, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు సంబంధించిన అన్ని మార్కుల జాబితాలు ఒకే సైట్‌లో లభ్యమయ్యేలా పనులు చేస్తున్నట్లు చెబుతున్నారు. భవిష్యత్తులో సౌలభ్యం మాటేమో కానీ ఇప్పుడు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వారు పట్టించుకోవడం లేదు.

విశ్వవిద్యాలయం పరిధిలో విద్యాలయాలు.. విద్యార్థులు...

- పరిధి: ఉమ్మడి ప్రకాశం
- డిగ్రీ కళాశాలలు: 97 (ప్రభుత్వం: 10.. ఎయిడెడ్: 10.. ప్రైవేట్: 77)
- విద్యార్థులు: 08 వేలు (డిగ్రీ మొదటి సంవత్సరం)
- పీజీ విద్యార్థులు: 1,000
- బీఈడీ కళాశాలలు: 47 (విద్యార్థులు: 12 వేలు)



నిధులు లేవు.. సిబ్బంది లేరు..

విశ్వవిద్యాలయం పరిధిలో 97 డిగ్రీ, 47 బీఈడీ కళాశాలలున్నాయి. మొదటి సంవత్సరంలో అన్ని కళాశాలల్లో కలిపి 21 వేల మంది విద్యార్థులున్నారు. ఈ ఏడాది మళ్లీ సుమారు అంతమంది కళాశాలల్లో చేరారు. వారికి పరీక్షలు నిర్వహించడం, సకాలంలో మార్కుల జాబితాలు ఇవ్వడం, సిలబస్ రూపొందించడం యూనివర్సిటీ బాధ్యత. దీనికి తగినంత సిబ్బంది అవసరం. ప్రస్తుతం ఏకేయూలో 8 మంది మాత్రమే రెగ్యులర్ బోధకులున్నారు. బోధనేతర సిబ్బంది నియామకాలు చేపట్టలేదు. 104 మంది సిబ్బంది, రూ. 150 కోట్ల బడ్జెట్ అవసరమని ప్రతిపాదనలు పంపినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. విధి లేని పరిస్థితిలో రోజువారీ వేతన చెల్లింపు పద్ధతిలో సిబ్బందిని నియమించుకొని పనులు చేయించుకుంటున్నారు. డిగ్రీ, బీఈడీ కళాశాలల నుంచి వచ్చే రుసుములతో అవసరాలు తీర్చుకోవాల్సి వస్తోంది.

కుమార రాజ్యం.. అన్నింటా కప్పాల భోజ్యం

◗ కేసులు కట్టకూడదంటే బేరసారాలు
◗ హోటళ్ల నుంచి బలవంతపు వసూళ్లు
◗ మట్టి తోలకాలకు అనధికారిక అనుమతులు



పశ్చిమ ప్రకాశంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఆ స్టేషన్‌ను అక్కడ పనిచేస్తున్న ఓ అధికారికి తన సామంత రాజ్యంలా మార్చుకున్నారు. నిజాయతీతో విధులు నిర్వహిస్తున్నానంటూ పలువురి వద్ద ఉత్తర 'కుమార' ప్రగల్భాలు పలుకుతారు. చేతల్లో మాత్రం అసాంఘిక కార్యకలాపాలకు కొమ్ముకాస్తారు. విధులు మరిచి అక్రమార్కులకు వంతపాడతారు. 'అన్ని' వ్యవహారాల్లోనూ తనకు కప్పం కట్టాల్సిందేనంటూ బెదిరింపులకు దిగుతారు. అడిగినంత చెల్లిస్తే ఆపై మీ ఇష్టమని చెబుతారు. ఏ అక్రమ వ్యవహారమైనా సజావుగా సాగించేందుకు సహకరిస్తానంటూ హామీ ఇస్తారు. సదరు అధికారి తీరు ఆ శాఖ సిబ్బందిలోనే ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. రౌతు కొద్దీ గుర్రమన్నట్లు.. అక్కడి సిబ్బందిలోనూ కొందరు దందాలకు తెరలేపారు. తమ స్థాయి అడ్డూ అదుపూ లేకుండా వసూళ్లు సాగిస్తున్నారు. – న్యూస్‌టుడే, పెద్దారవీడు

◗ **కానులు కురిపిస్తున్న కుంట...:** జాతీయ రహదారిపై ఉన్న ఆ జంక్షన్‌లో రాగి సంగటి, రొట్టెలు విక్రయించే చిరు హోటళ్లు మొత్తం డెబ్బై వరకు ఉన్నాయి. వీటిల్లో కొందరు అక్రమంగా మద్యం విక్రయాలు సాగిస్తుంటారు. ఈ విషయం సదరు రక్షక భట నిలయ అధికారికి కలిసొచ్చింది. ఒక్కో దుకాణ నిర్వాహకుడి నుంచి ఇప్పటికే రూ.5 వేలు- రూ.10 వేల వరకు వసూలు చేశారు. సీసీ కెమెరాలు బిగించాలంటూ ఇదే ప్రాంతంలోని వ్యాపారుల నుంచి గతంలో పనిచేసిన అధికారులు కూడా పెద్ద మొత్తంలో రాబట్టారు. మంగళవారం రాత్రి విధుల్లో ఉన్న పోలీసులు మండల కేంద్రంలోని ఓ హోటల్ వద్దకు వచ్చారు. భోజనం, కోడిమాంసం తిన్నారు. మద్యం కూడా కొంత తాగారు. ఆపై బిల్లు చెల్లించకుండా వెళ్లిపోయారు.

దొరికినా దొరలేనట...

వైకాపా నాయకుడు, మాజీ మంత్రి అనుచరుడు ఒకరు అక్రమంగా మద్యం తరలిస్తూ ఇటీవల పోలీసులకు దొరికిపోయారు. ఒత్తిడి మేరకు బలవంతంగా కేసు కట్టారు. ఆ తర్వాత నిందితుడి వివరాలు బయటకు రాకుండా గోప్యత పాటించారు. చివరికి ఆ పార్టీ నాయకులతో బేరసారాలు సాగించి స్టేషన్ బెయిల్ మంజూరు చేసి పంపించారు. ఈ తతంగంలో రూ.20 వేల వరకు నేతలు ముట్టజెప్పినట్లు సమాచారం.

◗ పదిహేను రోజుల క్రితం మండలంలోని ఓ గ్రామంలో గొలుసులు దొంగతనం చేస్తూ ఇద్దరు యువకులు గ్రామస్థులకు దొరికిపోయారు. ఆపై వారిని పోలీసులకు అప్పగించారు. ఈ విషయం తెలుసుకున్న నాయకులు రంగంలోకి దిగారు. చోరీ చేసిన గొలుసులు బాధితులకు తిరిగి అప్పగించేలా.. చోరులపై కేసు నమోదు చేయకుండా ఉండేలా సదరు పోలీసు అధికారే రాజీ కుదిర్చారు. ఈ వ్యవహారంలోనూ పెద్దమొత్తంలో నగదు సదరు అధికారి జేబులోకి వెళ్లినట్లు తెలిసింది.

ముడుపులు చెల్లిస్తే మట్టి మీదే...

ఫిర్యాదులు వస్తే మట్టి దందాను అరికట్టాల్సిన సదరు పోలీసు అధికారే.. అక్రమార్కులతో చేతులు కలిపి దందాకు పూర్తిగా సహకరిస్తున్నారు. ఇందుకుగాను ట్రాక్టర్లు, జేసీబీ యంత్రాల యజమానులతో ఇటీవల సమావేశం ఏర్పాటు చేశారు. తమతో మాట్లాడుకుని మీ ఇష్టం వచ్చిన చోట మట్టిని తవ్వుకుని తరలించుకోవాలంటూ వారికి భరోసా ఇచ్చారు.

◗ అదే స్టేషన్‌లో చాలా కాలం నుంచి విధులు నిర్వర్తిస్తున్న ఓ హెడ్ కానిస్టేబుల్. . సదరు అధికారిని ఆదర్శంగా తీసుకున్నారు. గ్రామాలకు వెళ్లి జూదం ఆడుతున్న వారిని, బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే వారిని అదుపులోకి తీసుకుంటారు. ఆపై కేసులు నమోదు చేస్తామంటూ బెదిరింపులకు దిగుతారు. వారి వద్ద ఉన్న నగదు తీసుకుని పంపేస్తారు. రహదారిపై ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసే సమయంలోనూ ఇదే తీరున వ్యవహరిస్తున్నారు.

స్టేషన్‌లో సివిల్ పంచాయితీ

- నిర్బంధించి ఖాళీ పత్రాలపై సంతకాలు
- ఆత్మహత్యాయత్నం చేసిన బాధితుడు
- చికిత్స పొందుతుండగా కేసు నమోదు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే:

పోలీసు స్టేషన్‌లో సివిల్ పంచాయితీ నేపథ్యంలో ఒక వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గత నెల 30న చోటుచేసుకున్న ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పరుచూరి రాజశేఖర్ అనే వ్యక్తిది పొన్నలూరు మండలం పరుచూరివారిపాలెం. అతను మూడేళ్ల క్రితం కొత్తపట్నం మండలం వజ్జిరెడ్డిపాలెంలోని ఓ హేచరీస్‌లో మేనేజర్‌గా పనిచేశారు. ఆ సమయంలో సుమారు రూ.2.50 కోట్ల మేర ఆర్థిక అవకతవకలు చోటుచేసుకున్నాయంటూ నిర్వాహకులు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో రాజశేఖర్‌ను సెప్టెంబర్ 27న ఒంగోలు రెండో పట్టణ పోలీసు స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టారు. మూడు రోజుల పాటు అతన్ని స్టేషన్‌లో నిర్బంధించారు. ఈ క్రమంలోనే పలు ఖాళీ పత్రాలపై బలవంతంగా సంతకాలు తీసుకున్నారనే విమర్శలున్నాయి. మూడు రోజుల నిర్బంధం, చిత్రహింసలు, ఖాళీ పత్రాలపై సంతకాలు తీసుకోవడంతో రాజశేఖర్ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. స్టేషన్ నుంచి బయటికి వచ్చిన అనంతరం త్రోవగుంట ఆటోనగర్ సమీపంలో గత నెల 30వ తేదీ రాత్రి ఆత్మహత్యాయత్నం చేశారు. అప్పటి నుంచి ఆయన ఒంగోలు జీజీహెచ్‌లోనే చికిత్స పొందుతున్నారు. ఈ ఉదంతంపై బాధితుడి భార్య ఒంగోలు జీజీహెచ్‌లోని అవుట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే రాజశేఖర్‌పై అక్టోబర్ 1న కొత్తపట్నం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. 2020-22 మధ్యకాలంలో రాజశేఖర్ నకిలీ కొటేషన్లు, ఇన్‌వాయిస్‌లతో పాటు హేచరీకి చెందిన సీడ్, ఫీడ్‌ను ఇతరులకు విక్రయించారని.. డిజిటల్ లావాదేవీల ద్వారా వచ్చిన డబ్బును తన ఖాతాలకు మళ్లించుకుని మోసాలకు పాల్పడినట్లు సదరు కేసులో పేర్కొన్నారు. బాధితుడు ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సమయంలో అతనిపై కొత్తపట్నం పీఎస్‌లో కేసు నమోదు కావటం గమనార్హం. ఈ విషయమై ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాజశేఖర్‌పై తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఉన్నాయన్నారు. ఈ క్రమంలో అతన్ని స్టేషన్‌కు పిలిపించి విచారించినట్లు తెలిపారు. నూతనంగా అమలులోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) ప్రకారం అతను అక్రమాలకు పాల్పడిన సొత్తుతో ఏదైనా ఆస్తులు కొనుగోలు చేస్తే వాటికి సంబంధించి చర్యలు తీసుకునే వెసులుబాటు ఉందన్నారు. పోలీసులను బెదిరించేందుకే రాజశేఖర్ ఆత్మహత్యాయత్నం చేసినట్లు భావిస్తున్నామని.. ఆ ఉదంతం పైనా కేసు నమోదు చేస్తామని చెప్పారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజశేఖర్

మంచి ప్రభుత్వం అనిపించుకుంటున్నారు

◗ సమస్యలు పరిష్కరిస్తున్న జిల్లా అధికారులు

ఈనాడు, ఒంగోలు:


ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత నెల 20న నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామానికి అనుకోకుండా వచ్చారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా షెడ్యూల్ ప్రకారం ఆయన శ్రీకాకుళం జిల్లాలో పర్యటించాల్సి ఉంది. వర్షాల కారణంగా అక్కడ సభ నిర్వహించలేని పరిస్థితులు తలెత్తడంతో వేదిక మారింది. పర్యటనకు ఒకరోజు ముందు రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో సీఎంవో నుంచి ఈ విషయం జిల్లా అధికారులకు తెలియడంతో ఆగమేఘాల మీద ఏర్పాట్లు చేశారు. అతి స్వల్ప వ్యవధిలోనే దిగ్విజయంగా నిర్వహించి ప్రశంసలు అందుకున్నారు. అలా అనుకోకుండా సీఎం రావడం నాగులుప్పలపాడు మండలంలోని మద్దిరాలపాడు గ్రామానికి ఇప్పుడు వరంగా మారింది. గ్రామస్థులతో మమేకమైన ముఖ్యమంత్రి చంద్రబాబు సమస్యలు తెలుసుకున్నారు. పలువురి ఇళ్లకు వెళ్లి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆ ఊరిని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. మాటలు చెప్పడమే కాకుండా వాటిని ఆచరించి చూపుతున్నారు.

◗ **ఇల్లు.. చదువు.. అభివృద్ధి పనులు...:** గ్రామస్థులకు మొత్తం ఇరవై రెండు హామీలు ఇచ్చారు. అందులో భాగంగా పటాన్‌బీబీసారా కుటుంబానికి రావాల్సిన గృహ నిర్మాణ బిల్లు రూ.65,150 చెక్‌ను అదేరోజు అందించారు. అనంతరం ఆమె కుమార్తెను ఒంగోలు హర్షిణి జూనియర్ కళాశాలలో, కుమారుడిని మార్టూరులోని వివేకానంద రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకున్నారు. ఆ గ్రామస్థుడు శ్రీనుకు ఇంటి స్థలం, గింజుపల్లి సురేష్‌కు ఎలక్ట్రికల్ చక్రాల కుర్చీని అధికారులతో అందజేసేలా చూశారు. గ్రామంలో శ్మశానవాటికకు అవసరమైన 1.89 ఎకరాల స్థలాన్ని రెవెన్యూ శాఖ గుర్తించి పంచాయతీ కార్యదర్శికి అప్పగించింది. వీటితోపాటు ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామ్ యోజనలో భాగంగా మద్దిరాలపాడు గ్రామాన్ని చేర్చి అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నారు.



మద్దిరాలపాడు సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ఎక్సైజ్ అధికారుల మందుచూపు




◗ సిబ్బంది చేతివాటం చూపుతారని మిష

◗ దుకాణాలకు కేటాయింపుల్లో ముందుగానే కోత

– న్యూస్‌టుడే, ఒంగోలు

జిల్లాలో మద్యం దుకాణాలన్నీ దాదాపు ఖాళీ అయ్యాయి. నూతన మద్యం విధానం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 1 నుంచి దరఖాస్తులు కోరింది. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ దుకాణాల స్థానంలో ప్రైవేటువి ఏర్పాటు చేసేలా సన్నాహకాలు చేపట్టింది. ఈ క్రమంలోనే జిల్లావ్యాప్తంగా దుకాణాలకు మద్యం సరఫరాలో కోత విధించింది. దీంతో నగర, పట్టణ ప్రాంతాల్లో బార్లు కిటకిటలాడుతుంటే.. మద్యం దుకాణాలు మాత్రం వెలవెలబోతున్నాయి.

◗ **బార్లలో నిలువు దోపిడీ...:** ప్రైవేట్ దుకాణాల ఏర్పాటుతో ఇప్పటి వరకు ప్రభుత్వం వాటిల్లో పనిచేస్తున్న సిబ్బంది ఉపాధికి గండి పడనుంది. ఉద్యోగాలు పోతాయన్న మిషతో వారు అనాసక్తిగానే విధులు నిర్వహిస్తున్నారు. కొందరు ఇప్పటికే ఉద్యోగాలు వదిలి ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ దుకాణాలకు పూర్తిస్థాయిలో మద్యం సరఫరా చేయడం శ్రేయస్కరం కాదని అధికారులు భావించారు. ఎలాగూ పోయే ఉద్యోగమే కదా అని చివరి రోజుల్లో ఎవరైనా చేతివాటం ప్రదర్శిస్తే అసలుకే మోసం వస్తుందనేది వారి ఆలోచన. దీంతో ఏరోజుకారోజు దుకాణాల్లో మద్యం విక్రయాల లెక్కల విషయంలో అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. రోజువారీ అమ్మకం డిమాండ్‌కు అనగుణంగా కేటాయించాల్సి ఉండగా అమాంతం తగ్గించారు. దీంతో జిల్లాలోని 170 మద్యం దుకాణాలు వెలవెలబోతున్నాయి. రోజువారీ ఆదాయంలో దాదాపు 50 శాతానికి పైగా పడిపోయింది. ఈ పరిస్థితులను బార్, రెస్టారెంట్ల యాజమాన్యాలు సొమ్ము చేసుకుంటున్నాయి. ప్రీమియర్ బ్రాండ్ల మద్యంపై క్వార్టర్ సీసాకు రూ.130-రూ.150, చీప్ లిక్కర్‌పై రూ.80 - రూ.100 వరకు అధికంగా వసూలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇలాఉంటే నూతన మద్యం విధానం అమలులో ఎక్సైజ్ యంత్రాంగం నిమగ్నమైంది. మంగళవారం నుంచే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించింది. ఈ ప్రక్రియ పూర్తయ్యే ఈ నెల 12 వరకు బార్ అండ్ రెస్టారెంట్లతో దోపిడీ కొనసాగనుంది.





పాకల తీరంలో వ్యర్థాలు, చెత్త సేకరించిన మంత్రి స్వామి, విద్యార్థులు



స్వచ్ఛసేవకు వచ్చిన పీఎన్‌సీఏ డిగ్రీ కళాశాల, పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

తీరంలో విద్యార్థుల స్వచ్ఛగీతం

న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం, కొండపి గ్రామీణం, టంగుటూరు :

ఈనాడు-ఈటీవీ స్వచ్ఛ స్ఫూర్తిని యువతరం అందిపుచ్చుకుని ముందుకు సాగుతోంది. మంగళవారం మూడు పట్టణాల్లో యువత కదం తొక్కి చెత్త తొలగించగా..బుధవారం విద్యార్థులు శ్రమదానం చేసి పాకల తీరాన్ని అద్దంలా తీర్చిదిద్దారు. మంత్రి బాలా వీరాంజనేయ స్వామి ముందుండి ఈ స్వచ్ఛ క్రతువును నడిపించారు.

ఈనాడు ఈటీవీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో శ్రమదానం

❖ ఉత్సాహంగా పాల్గొన్న మంత్రి స్వామి

పాకల సముద్రతీరంలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పీఎన్‌సీఏ డిగ్రీ కళాశాల విద్యార్థులు, పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామ సర్పంచి సైకం చంద్రశేఖర్ సహకారంతో తొలగింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాలవీరాంజనేయ స్వామి వందమంది విద్యార్థులతో కలిసి తీరం వెంబడి ఉన్న చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. వాటిని గ్రీన్ అంబాసిడర్ల సాయంతో చెత్తసంపద కేంద్రానికి తరలించారు. అనంతరం పొక్లెయిన్ సాయంతో పిచ్చిమొక్కలను తొలగించారు. తహసీల్దార్ బి.రవి, ఎంపీడీవో జయమణి, పంచాయతీరాజ్ ఏఈ శ్రీహరి, సీఐ హజరత్తయ్య, మెరైన్ సీఐ శివన్నారాయణ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రామోజీ స్ఫూర్తిని కొనసాగిస్తూ..

ఈనాడు-ఈటీవీ సంస్థల వ్యవస్థాపకులు దివంగత రామోజీరావు సేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని, ఆయన చూపిన బాటలోనే 'ఈనాడు' యాజమాన్యం ముందుకు సాగడం అభినందనీయమని మంత్రి బాలవీరాంజనేయస్వామి కొనియాడారు. పాకల తీరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులు, గ్రామస్థుల నుద్దేశించి మాట్లాడారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో స్వచ్ఛ సంకల్పాన్ని నిజం చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, కార్మికులకు పంచాయతీరాజ్ ఏఈ శ్రీహరి వంద టీషర్టులు, టోపీలు అందజేశారు. దేవీ సీఫుడ్స్, జీవీఆర్ రొయ్యల పరిశ్రమ ప్రతినిధులు అల్పాహారాన్ని పంపిణీచేశారు.



తీరంలో పొక్లెయిన్‌తో పిచ్చి మొక్కల తొలగింపు




మంత్రి స్వామి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు చెక్కు అందజేస్తున్న మహిళలు

వరద బాధితులకు ఎస్సీ మహిళల చేయూత

మద్దిపూడి, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు మండలంలోని కెల్లంపల్లి ఎస్సీ మహిళలు అండగా నిలిచారు. ఎస్సీ కాలనీకి చెందిన పలువురు మహిళలు రూ.55000 చెక్కును బుధవారం మద్దిపూడిలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో మంత్రి బాలా వీరాంజనేయస్వామి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అందజేశారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

త్రిపురాంతకేశ్వరుని ఆలయంలో ప్రాచీన శాసనం

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రాచీన త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయంలో 14వ శతాబ్దానికి చెందిన శాసనం వెలుగు చూసింది. ఆలయ ప్రాంగణంలో దక్షిణం వైపు నంది స్తంభంపై ఉన్న శాసనాన్ని చారిత్రక పరిశోధకులు తురిమెళ్ల శ్రీనివాస ప్రసాద్ గుర్తించారు. త్రిపురాంతకేశ్వర స్వామికి ధ్వజస్తంభం, బంగారు ఆభరణాలు తాను చేయించిన గుర్తుగా..భిక్షావృత్తి అయ్యంగారు దీన్ని వేయించినట్లు అందులో పేర్కొన్నారు. నాడు వీరశైవులు భిక్షావృత్తి చేసేవారని, వారినే భిక్షావృత్తి అయ్యంగార్లు గా వ్యవహరించేవారని ఆయన తెలిపారు. వారికి భూములతో పాటు అనేక ఆస్తిపాస్తులున్నా యాచించి ఆలయాల పునరుద్ధరణ, నిర్వహణ చేసేవారన్నారు. 14వ శతాబ్ధంలో త్రిపురాంతక ఆలయం వారి ఆధీనంలో ఉందని అక్కడి శాసనాలు వెల్లడిస్తున్నాయన్నారు. ధూప, దీప, నైవేద్యాలు వీరే నిర్వహించేవారని వారిలో శిద్దయ దేవయ్య అయ్యంగారు ముఖ్యులని శాసనాల్లో ఉందని శ్రీనివాస ప్రసాద్ వెల్లడించారు.



నంది స్తంభంపై ఉన్న శాసనం



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్టీయూ సంఘం నాయకులు

ఉపాధ్యాయ సమస్యలపై స్పందించాలి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ రెడ్డి కోరారు. ఒంగోలులోని సీపీఐ జిల్లా కార్యాలయంలో బుధవారం ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య అధ్యక్షతన రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా తృతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జడ్పీ పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్, మెడికల్ రీ ఎంబర్స్‌మెంట్ తదితర బిల్లుల చెల్లింపుల్లో జరుగుతున్న తీవ్ర జాప్యాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రమణారెడ్డి మాట్లాడుతూ, సీపీఎస్ ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఏ బకాయిల విషయంలో సవతితల్లి ప్రేమ కనబరుస్తున్నారని విమర్శించారు. అనంతరం గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమావేశంలో సంఘం నాయకులు బి.వెంగళరెడ్డి, చల్లా శ్రీనివాసులు, జి.నరసింహారెడ్డి, డి.నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

5న దామచర్ల సత్య ప్రమాణ స్వీకారం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన దామచర్ల సత్యనారాయణ (సత్య) ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళగిరి సమీపంలోని రాయల్ కన్వెన్షన్ ఫంక్షన్ హాలు చెంత ఈ నెల 5న మధ్యాహ్నం 12.30 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు జిల్లాలోని తెదేపా నాయకులు, కార్యకర్తలకు సమాచారమందించారు.

ఏపీఎస్పీ బెటాలియన్ స్థలం పరిశీలన

మద్దిపాడు, న్యూస్‌టుడే: పారిశ్రామికవాడలోని ఏపీఎస్పీ బెటాలియన్ ఏర్పాటుకు గతంలో కేటాయించిన స్థలాన్ని బుధవారం సాయంత్రం ఎస్పీ దామోదర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ మేరకు సర్వే నెం 456లో స్థలాన్ని పరిశీలించి మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. ఏపీఎస్పీ బెటాలియన్ అధికారులు ఆయన వెంట ఉన్నారు.



పారిశ్రామిక వాడలో స్థలం పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

సెపక్‌తక్రా పోటీల బాలుర విజేత కర్నూలు

◗ సత్తా చాటిన జిల్లా జట్టు

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: సత్తెనపల్లి మండలం పెదమక్కెనలో రెండ్రోజులపాటు జరిగిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్-19 బాలబాలికల సెపక్‌తక్రా ఆటల పోటీలు బుధవారం ముగిశాయి. బాలుర విభాగంలో నువ్వానేనా అన్నట్లు పోటీ సాగింది. తుది పోరులో ప్రకాశం జిల్లా జట్టుపై కర్నూలు జిల్లా జట్టు గెలిచి విజేతగా నిలిచింది. ప్రకాశం జట్టు రెండు, పశ్చిమ గోదావరి జట్టు మూడో స్థానాన్ని దక్కించుకున్నాయి. బాలికల విభాగంలో తుది పోటీలో కృష్ణా జిల్లా జట్టుపై అనంతపురం జిల్లా జట్టు గెలిచింది. కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లా జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు తెదేపా నాయకులు, అధికారులు కప్‌లు, జ్ఞాపికలు అందించారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ యెలినేడి రామస్వామి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త వెంకటఅప్పారావు, సర్పంచి అన్నపూర్ణమ్మ, తెలుగురైతు నాయకులు శ్రీనివాసరావు, సాంబయ్య, ప్రాంతీయ ఇంటర్మీడియట్ అధికారి జి.కె.జుబేర్, డీవీఈవో జె.పద్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులను గుర్తించి జాతీయ పోటీలకు ఎంపిక చేసినట్లు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.శ్రీనివాసులు, రాష్ట్ర పరిశీలకుడు సి.మారుతిప్రసాద్ తెలిపారు. ఎంపికైన బాలురు మణిపుర్‌లో, బాలికలు నాగాలాండ్‌లో ఈనెలాఖరులో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

❖ **బాలుర జట్టు:** ఎం.ఉమేష్ (కర్నూలు), ఎస్.శివకృష్ణ (ప్రకాశం), వై.రాహుల్ (పశ్చిమ గోదావరి), యు.వెంకటేష్ (నెల్లూరు), వై.విశ్వాస్‌పాల్ (తూర్పు గోదావరి), స్టాండ్‌బైలు ఎం.మణికంఠ (కర్నూలు), ఎస్.రోహిత్ (అనంతపురం), కె.శ్రీనాథ్ (గుంటూరు).

మహిళ మెడలో గొలుసు చోరీ

పెద్దారవీడు, న్యూస్‌టుడే: రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో గొలుసు లాక్కొని దుండగుడు ఉడాయించాడు. ఈ దేవరాజుగట్టు గ్రామ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన మదిరె పద్మ గ్రామ సమీపంలోని అల్లూరి పోలేరమ్మ గుడికి వెళ్లి జాతీయ రహదారి వెంబడి ఇంటికి వస్తుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన యువకుడు ఆమె మెడలోని రెండు సవర్ల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బావురుమంటున్న బోర్లు

❖ మూలకు చేరినవి వందల్లోనే..
❖ వెంటాడుతున్న గత పాలకుల పాపం

న్యూస్‌టుడే, చీమకుర్తి, పొదిలి :

గత పాలకుల పాపం నేటికీ వెంటాడుతోంది. నీరందించే బోర్ల వైపు వారు కన్నెత్తి చూడకపోవడంతో అవన్నీ మూలకు చేరాయి. జిల్లావ్యాప్తంగా పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో ఇలా వందలాది బోర్లు పనిచేయకపోవడంతో కష్టాలు తప్పడం లేదు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉండే చీమకుర్తి, పొదిలిలో పరిస్థితి మరింత దుర్భరంగా ఉంది.



గెలాక్సీపురి చీమకుర్తి పురపాలక సంఘంలోని వివిధ కాలనీల్లోని బోర్లు ఉత్సవ విగ్రహాల్లా మిగిలాయి. హెడ్‌లు లేక..గొలుసులు తెగి..హ్యాండిల్ పనిచేయక ఇవన్నీ అలంకారప్రాయంగా ఉన్నాయి. నగర పంచాయతీ పరిధిలో 360 బోర్లు ఉండగా.. దాదాపు నలభై వరకూ మూలకు చేరాయి. గత వైకాపా ప్రభుత్వం నిర్వహణ పనులు విస్మరించడంతో ఈ దుస్థితి దాపురించింది. గతంలో ఓ పర్యాయం టెండరు పిలిచినా గుత్తేదారులెవ్వరూ ముందుకు రాలేదు. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందని పేదలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ నూతన కమిషనర్ వై.రామకృష్ణయ్య స్పందిస్తూ బోర్ల మరమ్మతులకు అవసరమైన సామగ్రి కొనుగోలుకు నిధులు కేటాయిస్తూ కౌన్సిల సమావేశంలో తీర్మానించామని చెప్పారు. త్వరలో ఆయా ప్రాంతాల్లో బోర్లకు మరమ్మతులు చేయిస్తామన్నారు.

అన్నీ అలంకారప్రాయం..

పొదిలి నగర పంచాయతీలోని చేతిపంపులు పనిచేయడం లేదు. మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రతి ఏడాది మరమ్మతులు చేసేవారు. నగర పంచాయతీగా రూపాంతరం చెందిన తరువాత చేతిపంపుల నిర్వహణ వదిలేశారు. నగర పంచాయతీలోని 20 వార్డుల్లో సుమారు వందకు పైగానే చేతిపంపులున్నాయి. మరమ్మతులు చేయక చాలా వరకూ నిరుపయోగంగా ఉన్నాయి. గత్యంతరం లేక అన్ని వార్డుల్లో ప్రస్తుతం డీప్‌బోర్లు, మోటార్ల సాయంతో నీటిని పైపులైన్ ద్వారా సరఫరా చేస్తున్నారు. నగర పంచాయతీ ఆధ్వర్యంలో తెదేపా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కొన్నిచోట్ల డీప్‌బోర్లు, పైపులైన్లు మరమ్మతులు చేయించారు. డీప్‌బోర్లు లేనిచోట్ల మాత్రం ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. పెద్దచెరువు, చిన్నచెరువు పరివాహక ప్రాంతాల్లోని చేతిపంపులకు మరమ్మత్తులు చేయిస్తే కొంతవరకు ఉపయోగం ఉంటుందని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



విశ్వనాథపురం అయిదోలైను నర్సరీ వద్ద చేతిపంపు దుస్థితి



ప్రకాశ్‌నగర్‌లో ఉత్సవ విగ్రహంలా..

అక్రమంగా తరలుతున్న బియ్యం పట్టివేత

పెద్దారవీడు: బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దేవరాజుగట్టు వద్ద తనిఖీలు చేస్తుండగా రెండు అశోక్‌లేలాండ్ వాహనాల్లో ప్రభుత్వ బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించి వాటిని నిలిపివేశారు. ఆ వాహనాల్లో 115 బియ్యం బస్తాలున్నట్లు గుర్తించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వాహనాలను స్టేషన్‌కు తరలించినట్లు పెద్దారవీడు పోలీసులు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 535 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 126, రిటైల్ లైవ్ - 148, చికెన్ విత్ స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్- 244

టెట్ పరీక్ష కేంద్రాల్లో వసతుల పరిశీలన

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జిల్లాలో గురువారం నుంచి ప్రారంభం కానున్న టెట్ పరీక్షలకు ఎంపిక చేసిన కేంద్రాల్లో వసతులను బుధవారం రాష్ట్ర పరిశీలకులు, విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. నగరంలోని బ్రిలియంట్, నేషనల్ చర్చి కళాశాల, మార్కాపురంలోని రెండు కళాశాల కేంద్రాలను పరిశీలించారు. విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన కంప్యూటర్లు గురించి కళాశాల ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, విద్యుత్తుకు ఇబ్బంది రాకుండా చూడాలన్నారు. గురువారం నుంచి ఈనెల 22 వరకు బ్యాచ్‌ల వారీగా టెట్ పరీక్షలు జరగనున్నాయి. అబ్జర్వర్‌తోపాటు ఉప విద్యాశాఖ అధికారి సామా సుబ్బారావు, ఒంగోలు ఎంఈవో కిషోర్‌బాబు ఉన్నారు.



నగరంలోని బ్రిలియంట్ కంప్యూటర్ సెంటర్‌ను పరిశీలిస్తున్న అబ్జర్వర్, విద్యాశాఖ అధికారులు

నేడు గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల సమావేశం

చీమకుర్తి: చీమకుర్తి, కంభంపాడు, బూదవాడ, ఏలూరు రోడ్డు ప్రాంతాల గ్రానైట్ పాలిషింగ్ ఫ్యాక్టరీ యజమానుల సంఘం సమావేశం ఈనెల 3 గురువారం రామతీర్థంలోని గ్రానైట్ వృత్తి శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఆయా యూనియన్ల ప్రతినిధులు తెలిపారు. వివిధ సమస్యలపై ఇందులో చర్చిస్తామన్నారు. యజమానులంతా హాజరు కావాలని వారు కోరారు.

ఉద్యోగోన్నతులు కల్పించరూ

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ నగరశాఖ ఆధ్వర్యంలో బుధవారం సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. నగరపాలక సంస్థ వద్ద జరిగిన కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరారెడ్డి, డి.వీరాంజనేయులు మాట్లాడుతూ దీర్ఘకాలంగా మున్సిపల్ టీచర్లు ఉద్యోగోన్నతులకు నోచుకోవడం లేదన్నారు. వెంటనే దీనిపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీఎఫ్ ఖాతాలు తెరవాలని, పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందిని తరలించకుండా కొనసాగించాలన్నారు. వారు చేయాల్సిన కార్యక్రమాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. తొలగిస్తే విద్యాప్రమాణాలు దెబ్బతింటాయన్నారు. అనంతరం కమిషనర్ కె.వెంకటేశ్వరరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నగర గౌరవాధ్యక్షులు చావలి వెంకటరమణ, శేషగిరి, పీవీ నారాయణ, భాస్కర్, రామకృష్ణ, రవి, చిన్నస్వామి, అబ్దుల్‌హై తదితరులు పాల్గొన్నారు.



వాగు దాటితేనే..అంతిమ సంస్కారం

న్యూస్‌టుడే, కంభం : అంత్యక్రియల నిర్వహణ రావిపాడు వాసులకు ప్రాణ సంకటంగా మారింది. గ్రామంలో ఎవరైనా చనిపోతే ఊరికి ఉత్తరాన ఉన్న గుండ్లకమ్మ వాగు దాటి అవతలి వైపు ఉన్న మరుభూమికి వెళ్లాల్సి వస్తోంది. ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వాగులోంచే పాడె మోసుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. దీనిపై అధికారులకు విన్నవించినా ఫలితం లేదని వారు వాపోతున్నారు. బుధవారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందగా.. వాగులోంచి పాడె మోసుకుంటూ తీసుకెళ్లారు. పొలాలకు సైతం ఆ దారిలోనే వెళ్లాల్సి వస్తోందని వారంటున్నారు.

ఈదుకుంటూ వెళ్లి.. మృతదేహాన్ని తీసుకొచ్చి..

❖ సాగర్ కాలువలో కానిస్టేబుల్ సాహసం

త్రిపురాంతకం : సాగర్ కాలువలో కొట్టుకుపోతున్న మృతదేహాన్ని గట్టుకు తీసుకొచ్చేందుకు..స్థానికులు ససేమిరా అనడంతో ఓ కానిస్టేబుల్ రంగంలోకి దిగారు. ప్రమాదకరంగా ప్రవహిస్తున్న కాలువలోకి దూకి గట్టుకు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలో యర్రగొండపాలెం రోడ్డులోని సాగర్ ప్రధాన కాలువలో మృతదేహం తేలియాడుతోందని స్థానికులు బుధవారం సాయంత్రం పోలీసులకు సమాచారమందించారు. దీంతో సిబ్బంది అక్కడికి చేరుకుని బయటకు తీసేందుకు యత్నించారు. స్థానికుల సహకారం కోరగా..అప్పటికే చీకటి పడుతుండటంతో ఎవరూ ముందుకు రాలేదు. దీంతో స్థానిక స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు కాలువలోకి దూకి ఈదుకుంటూ వెళ్లి మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. మృతుడు మాచర్లకు చెందిన వ్యక్తి కావొచ్చని భావిస్తున్నారు. ఎనిమిది అడుగుల లోతున నీరు ప్రవహిస్తున్నా..వెనుకంజ వేయని హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులును ఎస్సై బసవరాజుతో పాటు సిబ్బంది, స్థానికులు అభినందించారు. అనంతరం మృతదేహాన్ని యర్రగొండపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రైలు ఢీకొని..

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి (40) మృతి చెందారు. ఈ సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఒంగోలు జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పాతసింగరాయకొండ పరిధిలోని విజయవాడ-చెన్నై రైలుమార్గంలోని పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడివుందన్న సమాచారం మేరకు జీఆర్పీ పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, సింగరాయకొండ మండల పరిసర ప్రాంతాలకు చెందిన వ్యక్తిగా భావిస్తున్నామన్నారు. అనంతరం మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై అరుణకుమారి తెలిపారు.

మార్కాపురం

•మార్కాపురం •గిద్దలూరు •యర్రగొండపాలెం

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



కొమరోలులో వాసవీ మాత



కంభం : విద్యుద్దీపాల అలంకరణలో అమ్మవారిశాల

కొమరోలు గ్రామీణం, కంభం, పొదిలి, న్యూస్‌టుడే: కొమరోలులో వెలసిన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలను ఈ నెల 3 నుంచి 13 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు టి.వి.రమణయ్య తెలిపారు. కంభంలోని వాసవీ కన్యక పరమేశ్వరీ ఆలయాన్ని విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. బుధవారం నుంచి ఈ నెల 14 వరకు రోజూ అమ్మవారు ఒక్కో అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. పట్టణ సమీపంలోని కోట సత్యమాంబదేవి ఆలయంలోనూ ఏర్పాట్లు పూర్తి చేశారు. అంకాలమ్మ, వెంకటేశ్వరస్వామి, రంగస్వామి ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ● ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకునేందుకు అందరి సహకారం అవసరమని డీఎస్పీ నాగరాజు పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం పలు సామాజిక వర్గాల పెద్దలతో శాంతి సంఘ సమావేశం నిర్వహించారు. ● పొదిలిలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి, శ్రీఅంకాలపరమేశ్వరి, మహాలక్ష్మమ్మ దేవాలయాల్లో అమ్మవార్లు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. దేవాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

ఐసీడీఎస్ ఆవిర్భావ దినోత్సవం



గాంధీజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సూపర్‌వైజర్ మరియకుమారి, కార్యకర్తలు

త్రిపురాంతకం గ్రామీణం: మండలంలోని మేడపి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సెక్టార్ సూపర్‌వైజర్ మరియకుమారి, కార్యకర్తల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్టోబరు 2, 1982లో యర్రగొండపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు స్థాపించారని, అప్పటి నుంచి చిన్నారులు, గర్భవతులు, బాలింతలకు సేవలను అందిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. అంతకు ముందు జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు.

చదువులమ్మ కోవెలలో సంబరాలకు శ్రీకారం

● తర్లుపాడు పాఠశాలకు.. 75 సంవత్సరాలు పూర్తి



సిద్ధమవుతున్న స్తూపం



తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

మార్కాపురం పట్టణం, తర్లుపాడు, న్యూస్‌టుడే:

ఆ కోవెల.. వేలాది మందికి అక్షరాలను నేర్పింది. వివిధ రంగాల్లో రాణించేలా తీర్చిదిద్ది సమాజానికి అందించింది. 75 సంవత్సరాలుగా ఎందరికో బాట చూపిన ఈ బడికి నేడు ప్లాటినం జూబ్లీకి సిద్ధమవుతోంది. ఇక్కడ చదువుకున్న పూర్వ విద్యార్థులు తమకు విద్య నందించిన ఈ బడి అభివృద్ధికి చేతనైనంత సాయం చేశారు. తమకు స్ఫూర్తినందించిన ఈ పాఠశాలలో ఈ నెల చివరి వారంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

రూ.10లక్షలతో అభివృద్ధికి చేయూత..

1949వ సంవత్సరంలో స్థాపించిన ఈ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఈ ఏడాదితో 75 సంవత్సరాలు పూర్తి చేసుకోబోతోంది. ఈ సందర్భంగా పాఠశాలను మరింతగా అభివృద్ధి చేయాలని పూర్వ విద్యార్థులు ముందుకొస్తున్నారు. 1963లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థి, పారిశ్రామిక వేత్త ఉడుముల లక్ష్మీనారాయణరెడ్డి బాలికల భోజనశాల అభివృద్ధికి రూ.4 లక్షల విరాళాన్ని అందజేశారు. పూర్వ విద్యార్థులు గాయం శ్రీనివాసరెడ్డి, నేరేళ్ల అమరం, శేషగిరి, రంగారావు రూ.లక్ష, ప్రస్తుత తర్లుపాడు జడ్పీటీసీ సభ్యురాలు వెన్నా ఇందిరా రూ.50,000, 1992-93 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు రూ.1.25లక్షల విలువైన బెంచీలు పాఠశాలకు అందించారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ కశెట్టి కొండయ్య రూ.75వేలు అందజేశారు. ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముత్తోజు. సుధాకర్ రూ.1.2లక్షలు, ఉపాధ్యాయ బృందం రూ.1.2 లక్ష అందించారు. ఇలా సేకరించిన డబ్బులతో వజ్రోత్సవ స్తూపం, బాలికలకు ప్రత్యేక భోజనశాల, విద్యావనం, ముఖద్వార నిర్మాణం, ప్రధాన ద్వారం నుంచి పాఠశాలలోకి రోడ్డు నిర్మాణం, పరిసరాల సుందరీకరణ, రక్షణ గోడకు మరమ్మతులు, నాలుగు వేల లీటర్ల సామర్థ్యం గల నీటి ట్యాంక్ నిర్మాణం తదితర పనులు చేపట్టనున్నారు.

సహకారంతో ముందుకు..



పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉంది. ఇటువంటి కార్యక్రమాలు పాఠశాలల్లో నిర్వహించడం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం.

– ఎం.సుధాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు

ఆనందంగా ఉంది



ఈ పాఠశాలలో 1988-89వ సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న నేను ప్రస్తుతం ఈ పాఠశాలలోనే ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నా ఈ సమయంలోనే ప్లాటినం జూబ్లీ వేడుకలు రావడం..అందులో మా వంతు పాత్ర పోషించడం ఆనందంగా ఉంది. ప్రతి ఒక్క పూర్వ విద్యార్థి ఈ వేడుకల్లో పాల్గొని ఆ జ్ఞాపకాలను పదిలపరుచుకోవాలి. – జి.శ్రీనివాసులు, పాఠశాల పూర్వ విద్యార్థి

చౌక దుకాణ డీలర్లకు న్యాయం చేయండి



లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీలర్ల సంఘం నాయకులు

పొదిలి, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని చౌక దుకాణ డీలర్లకు న్యాయం చేయాలని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గౌస్ బాషా బుధవారం ఉండవల్లిలో ఐ.టి, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్డుల రేషనలైజేషన్ చేసి బైపాస్ చేయాలని విన్నవించారు. డీలర్లకు గౌరవ వేతనం రూ.7 వేలు ఇవ్వాలని, క్వింటా బియ్యానికి రూ.200 కమిషన్ పెంచాలని, డీలర్ల ద్వారా సరుకులు పంపిణీ జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన లోకేశ్ ప్రభుత్వంలో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు గౌస్ బాషా తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర అధ్యక్షుడు డి.లీలామాధవరావు, అనకాపల్లి అధ్యక్షుడు కె.శేషు, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి హేమలత తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గౌస్‌బాషా

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి పట్టణంలోని సమస్యలు పరిష్కరించాలని తెదేపా నాయకులు మహమ్మద్ గౌస్, మొహియద్దీన్‌సాలు బుధవారం మర్రిపూడి పర్యటన జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా పట్టణంలోని చెత్తను చెరువుగట్టులో వేస్తున్నారని, చెరువులో ఇష్టానుసారంగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారని, పట్టణంలో నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని, ఆక్రమణలో ఉన్న చెరువు స్థలాలను కాపాడాలని విన్నవించారు.

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు



నిరసన వ్యక్తం చేస్తున్న వివిధ సంఘాల కార్మికులు

కంభం, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు.. అని, దాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని సీఐటీయూ కన్వీనర్ ఖాజావలి అన్నారు. స్థానిక కందులాపురం కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం బుధవారం పలువురు కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 2001 నుంచి ఎన్నో ఉద్యమాలు చేస్తున్నా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని చెప్పారు. ఉక్కు పరిశ్రమను అమ్మే హక్కు ఎవరికీ లేదని తెలిపారు. 12 గ్రామాల ప్రజలు వేల ఎకరాల భూమిని ఇచ్చారు. 32 మంది ప్రాణత్యాగాలు చేశారన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం కో కన్వీనర్ ఖాజావలి, కార్మికులు వెంకటేశ్వర్లు, చెన్నయ్య, పాపయ్య, శ్రీను, సుబ్బయ్య, అనిల్, రాజు, కిరణ్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

నిఘా నేత్రం.. అలంకార ప్రాయం



కొనకనమిట్ల బస్టాండ్ సెంటర్‌లో పనిచేయని సీసీ కెమెరాలు

కొనకనమిట్ల, న్యూస్‌టుడే: నేరాల నియంత్రణ, నిందితులను పట్టుకునేందుకు మండలంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా మారాయి. కొనకనమిట్ల పోలీసుస్టేషన్ పరిధిలో రూ.1.50 లక్షలు ఖర్చు చేసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పలు దుకాణాల యజమానుల స్వచ్ఛందంగా మరి కొన్ని కెమెరాలు పెట్టించారు. కొనకనమిట్ల, గొట్లగట్టు రెండు రోడ్డు కూడలి, ప్రధాన సెంటర్ తదితర కూడళ్లలో పది అమర్చారు. ప్రస్తుతం చాలా కెమెరాలు మరమ్మతులకు గురయ్యాయి. కొనకనమిట్ల బస్టాండ్ సెంటర్‌లో మూడు కెమెరాలు పని చేయకపోవడంతో దొంగతనాలు పెరిగాయి. నిందితులను గుర్తించడం, రహదారి ప్రమాదంలో వాహనాలు గుర్తించడం కష్టంగా మారుతోంది. దీనిపై ఎస్సై రాజ్‌కుమార్ మాట్లాడుతూ సీసీ కెమెరాల మరమ్మతులు చేయిస్తామని.. కొత్తవి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ముగిసిన షటిల్ పోటీలు

త్రిపురాంతకం గ్రామీణం : త్రిపురాంతకంలోని బీటీఆర్ స్టేడియంలో జరుగుతున్న నియోజకవర్గాల స్థాయి షటిల్ పోటీలు బుధవారం ముగిశాయి. మార్కాపురానికి చెందిన రమేష్, రహీం జట్టు ప్రథమ, త్రిపురాంతకానికి చెందిన బీవీ, రాంబాబు జట్టు ద్వితీయ స్థానంలో నిలవగా, మార్కాపురానికి చెందిన మనోజ్, శివ, భరత్, శ్రీను జట్లు నాలుగో స్థానాన్ని దక్కించుకున్నారు. విజేతలకు దాతలు వీరగంధం శ్రీనివాస్, రఘుప్రసాద్‌రెడ్డి, అంజిరెడ్డి బహుమతులను అందజేశారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న దాతలు



ఆక్రమణలను పరిశీలిస్తున్న తహసీల్దార్ జితేంద్ర కుమార్, ఎస్సై రవీంద్రారెడ్డి

ఆక్రమణలు తొలగించాలి

బేస్తవారపేట: బేస్తవారపేట పట్టణంలోని అమరావతి-అనంతపురం 544-డి జాతీయ రహదారికిరువైపులా ఏర్పాటు చేసిన సర్వీస్ రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న వ్యాపార సముదాయాలను బుధవారం తహసీల్దార్ జితేంద్రకుమార్, ఎస్సై రవీంద్రారెడ్డి నేషనల్ హైవే సిబ్బందితో కలిసి పరిశీలించారు. పట్టణంలోని సర్వీస్ రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న పలు దుకాణాదారులు గురువారం లోగా ఆయా వ్యాపార సముదాయాలను స్వచ్ఛందంగా తొలగించాలని దీనిపై వ్యాపారస్థులు, ప్రజలు సహకరించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం : 8008552658
పొదిలి : 8008550360
కంభం : 8008574141

మార్కాపురం, న్యూస్‌టుడే:



సమస్య: మార్కాపురం పట్టణంలోని తోటవారి వీధిలోని పార్కులో పడేస్తున్న చెత్తను తొలగించిన చెత్తను నివాసాల ముందు పడేస్తున్నారు. గాలికి చెత్త నివాసాల్లోకి వస్తోంది. ఇబ్బందులు పడుతున్నాం. – ఆవులయ్య, తోటవారి వీధి, మార్కాపురం

సమాధానం: సిబ్బందిని పంపి చెత్తను తక్షణమే తొలగించడానికి చర్యలు తీసుకుంటాం. – చెన్నకేశవులు, శానిటరీ ఇన్స్‌పెక్టర్, మున్సిపల్, మార్కాపురం

భారత్‌ను విశ్వగురువు చేయడమే మోదీ లక్ష్యం



దరిమడుగులో మాట్లాడుతున్న రాజా శ్రీకాంత్

మార్కాపురం, న్యూస్‌టుడే: భారత్‌ను విశ్వగురువు చేయడమే ప్రధాన మంత్రి నరేంద్రమోడీ లక్ష్యమని భాజాపా ఓబీసీ రాష్ట్ర నాయకుడు రాజా శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండలంలోని దరిమడుగు గ్రామం నందు విశ్వకర్మ యోజన పథకంలో ఎంపికైన లబ్ధిదారులకు జరుగుతున్న శిక్షణ తరగతులను భాజపా పరిశీలించి శిక్షకులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు, లక్ష్మీ, వాసవి ప్రియ, సతీష్‌కుమార్, శిక్షకులు పాల్గొన్నారు

కాలువల్లో పూడికతీత ప్రారంభం



ఆర్టీసీ బస్టాండ్ ముందు ఉన్న పాత కాలువలో పూడిక తొలగిస్తున్న దృశ్యం.

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి నగర పంచాయతీలో మురుగునీటి సమస్య పరిష్కారానికి, ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రెండు రోజులుగా పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగిస్తున్నారు. బుధవారం పాత కాలువలో పేరుకుపోయిన పూడికను ప్రొక్లయిన్ సహాయంతో తొలగించారు. ఆర్టీసీ బస్టాండ్ ముందు ఉన్న కాలువ వరకు ఆక్రమణలు తొలగించారు. పడమర వైపు కాలువ లేనప్పటికీ రోడ్డుపైకి వచ్చిన ఆక్రమణలను తొలగించారు. సుమారు 15 ఏళ్ల క్రితం అప్పుడు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రధాన రహదారిపై మార్కింగ్ ఇచ్చి ఆక్రమణలను తొలగించారు. దీంతో రహదారి విశాలంగా మారింది. వారం రోజుల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని నగర పంచాయతీ కమిషనరు పి.శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలో ప్రజల సౌకర్యార్థం పూడిక తీత పనులు చేపడుతున్నట్లు ఆయన చెప్పారు.

మహాత్ముని అడుగుజాడలు అనుసరణీయం




గిద్దలూరు: గాంధీ బొమ్మ కూడలి వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న గిద్దలూరు నగర పంచాయతీ కమిషనర్, కౌన్సిలర్లు

● ఘనంగా గాంధీ జయంతి

మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లోని పట్టణాలు, గ్రామాల్లోని పలు పాఠశాలల్లో, కళాశాలలో బుధవారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణ, గ్రామ కూడళ్లో, వీధుల్లో ఏర్పాటు చేసి గాంధీజీ విగ్రహానికి ప్రజాప్రతినిధులు, రాజకీయనాయకులు, స్వచ్ఛంద సంఘాలు, యువజన సంఘాలు,. ఆర్యవైశ్య నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు ర్యాలీ చేపట్టారు. ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. విద్యార్థులు వైద్యశాల, పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ వేడుకలను చేపట్టారు. పంచాయతీల్లో అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. అనంతరం స్వచ్ఛతాహీ సేవ, ఉపాధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను నాయకులు సన్మానించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, అన్నీ గ్రామ పంచాయతీల్లో అధికారులు గాంధీ, లాల్‌బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ● మార్కాపురం మున్సిపల్ కార్యాలయంలో ఉన్న గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే నారాయణరెడ్డి జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, సిబ్బంది నివాళులర్పించారు. భూపతిపల్లె, నికరంపల్లి గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ గ్రామ సభల్లో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు. అనంతరం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను శాలువలు, పూలమాలలతో సన్మానించారు. మార్కాపురం సబ్ జైల్లో అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి బాలాజీ రిమాండ్ ముద్దాయిలకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు.● గిద్దలూరు నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్, కౌన్సిలర్లు, తహసీల్దారు కార్యాలయంలో అధికారులు, సిబ్బంది, గిద్దలూరు పోలీస్ స్టేషన్‌లో సీఐ, పోలీసులు సురేష్ గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యాలయం ఆవరణలోపిచ్చి మొక్కలు, చెత్తను తొలగించారు. ర్యాలీ చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. సీతారామ పిరమిడ్ ధ్యాన మందిరం సభ్యులు కంభం గుచ్చు కాలువ సమీపంలోని ధ్యాన మందిరం నుంచి కందులాపురం కూడలి వరకూ బుధవారం శాకాహారం ర్యాలీ నిర్వహించారు. పొదిలి పట్టణంలోని మానవతా సేవాసంస్థ, ఆర్యవైశ్యసంఘం, ఆవోపాల ఆధ్వర్యంలో పాతూరులో, కొత్తూరులోని గాంధీ విగ్రహాలకు పూలమాల వేసి స్మరించుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.● కొమరోలులోని ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిశాల ఆవరణలో ఉన్న గాంధీజీ, విగ్రహాలకు పూలమాల వేసి ఘనంగా నిర్వహించారు. ● తర్లుపాడు ప్రభుత్వ వైద్యశాలలో నెహ్రూ యూత్ ఆధ్వర్యంల రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ● యర్రగొండపాలెంలో తెదేపా ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు క్యాంపు కార్యాలయంలో ఎరిక్షన్‌బాబు గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘ నాయకులు ప్రధాన రహదారిలో గాంధీ విగ్రహానికి పూల మాలలు వేశారు. స్థానిక ముస్లిమ్‌యూత్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు ఇస్మాయిల్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు.

– న్యూస్‌టుడే, బృందం




బేస్తవారపేటలోని గాంధీబజార్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు



గిద్దలూరు : ఆసుపత్రి ప్రాంగణంలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు



త్రిపురాంతకం : పోలీస్ స్టేషన్‌లో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్ర పటాలకు నివాళులర్పిస్తున్న సీఐ అస్సాన్, ఎస్సై శివ బసవరాజు



యర్రగొండపాలెంలో గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేస్తున్న ఎరిక్షన్‌బాబు, తెదేపా నాయకులు



మార్కాపురం : సబ్ జైల్లో పండ్లు పంపిణీ చేస్తున్న న్యాయమూర్తి బాలాజీ

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న కారు

తర్లుపాడు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం, కారు ఢీ కొనడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలై కాలు విరిగిన సంఘటన మండలంలోని కలుజువ్వలపాడులో జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. కలుజువ్వలపాడు ఎస్సీ కాలనీకి చెందిన సిరిపురపు కోటయ్య అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మార్కాపురం నుంచి వస్తున్న కారు ఢీ కొంది. స్థానికులు క్షతగాత్రుడిని 108 వాహనంలో మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం క్షతగాత్రుడిని మెరుగైన చికిత్స కోసం నర్సరావుపేటకు తరలించినట్లు తెలిపారు.

మద్యం సీసాల స్వాధీనం

బేస్తవారపేట: బేస్తవారపేటలోని స్థానిక టైలర్స్ కాలనీలో అక్రమంగా నిర్వహిస్తున్న ఓ బెల్ట్ దుకాణంపై బుధవారం ఎస్సై రవీంద్రారెడ్డి సిబ్బందితో దాడులు నిర్వహించారు. నిర్వాహకుడు దూదేకుల చిన్న కాశయ్యను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుతో యువతి మృతి

బేస్తవారపేట : పాముకాటుకు గురై ఓ యువతి మృతి చెందిన సంఘటన కంభం మండలం జంగంగుంట్లలో బుధవారం చోటుచేసుకుంది. మెట్టెల పోలురాజు, బాలగురవమ్మ దంపతులది బేస్తవారపేట మండలం జే.సి అగ్రహారం స్వగ్రామం కాగా కుమార్తె లక్ష్మీ (19)తో కలిసి బతుకుదెరువు నిమిత్తం పదేళ్ల కిందట కంభం మండలం జంగంగుంట్లకు వచ్చి స్థిరపడ్డారు. బుధవారం ఇంటి వద్ద పాము కాటుకు గురైన లక్ష్మీ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోగా గమనించిన తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం తిప్పాయిపాలెం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది.

పర్యావరణానికి తూట్లు...!

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే :

సాగునీటి కాలువలు కలుషితం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా..కొందరు ప్లాస్టిక్ వ్యర్థాలు అందులో వేస్తూ పర్యావరణ హితానికి తూట్లు పొడుస్తున్నారు. పట్టణంలోని చెరువులోకి వెళ్లే సప్లయ్ ఛానల్‌ను దాదాపు 13 సంవత్సరాల కిందటే ఇరువైపులా కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టి బాగు చేశారు. వర్షాలు పడితే గుండ్లకమ్మ మీదుగా నీరు చెరువులోకి వెళ్లేందుకు ఈ ఈ ఛానల్‌ను నిర్మించారు. చెత్త వేయకుండా ఇరువైపులా కంచెను సైతం ఏర్పాటు చేశారు. ఇందులో వ్యర్థాలతో, ప్లాస్టిక్ వస్తువులు వేస్తుండటంతో అది కాస్త అధ్వానంగా తయారైంది. చెత్త గుట్టలుగా పేరుకుపోతున్నాయి. మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని పెద్దనాగులవరం వెళ్లే రోడ్డులో రాజ్యలక్ష్మీకాలనీకి ఆనుకొని ఉండే కొచ్చెర్ల కోట కాలువ పరిస్థితి ఇలాగే ఉంది. వీటిని చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



సప్లయ్ ఛానల్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు



రాజ్యలక్ష్మీకాలనీకి ఆనుకొని ఉండే కొచ్చెర్లకోట కాలువ దుస్థితి ఇదీ...

కనిగిరి

•కనిగిరి • దర్శి • కొండపి

మేమున్నాం.. మీకు తోడుగా.. కనిగిరి : 8008574114, దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

కురిచేడు, న్యూస్‌టుడే:

సమస్య: పెద్దవరం గ్రామంలోని బీసీ కాలనీలో నివాసాల నుంచి వచ్చే మురుగు ఓ ఇంటి సమీపంలో చేరి కుంటను తలపిస్తుంది. దుర్వాసనతో పాటు దోమల వ్యాప్తి అధికమై అనారోగ్యానికి గురవుతున్నాం. – **నరేష్, స్థానికుడు**

సమాధానం: వెంటనే పరిశీలించి, మురుగును తొలగించే చర్యలుచే పడతాం. – **రమేష్, పంచాయతీ కార్యదర్శి, పెద్దవరం**

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని కొండారెడ్డిపల్లి - హెచ్ఎంపాడు రహదారి అంచులు చిల్లచెట్లతో నిండిపోయింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించగలరు. – **స్థానికులు.**

సమాధానం: పంచాయతీ నిధులతో చిల్లచెట్లు తొలగించి సమస్యను పరిష్కరిస్తాం. – **తమస్తాన్ షరీఫ్, ఈవోఆర్డీ**



ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

తీరంలో.. స్వచ్ఛతకు కదిలింది నవతరం

❖ ఈనాడు, ఈటీవీ పిలుపు మేరకు వ్యర్థాలు, పిచ్చి మొక్కల తొలగింపు

❖ భాగస్వాములైన పీఎన్‌సీఏ కళాశాల, పాకాల జడ్పీ ఉన్నత పాఠశాలవిద్యార్థులు



మాట్లాడుతున్న మంత్రి స్వామి, గ్రామ సర్పంచ్ సైకం చంద్రశేఖర్, ఎంపీడీవో, తహసిల్దార్

సింగరాయకొండ గ్రామీణం, కొండపి గ్రామీణం, టంగుటూరు, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నివారణే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సింగరాయకొండ పీఎన్‌సీఏ కళాశాల, పాకల జడ్పీ పాఠశాల విద్యార్థులు అభిప్రాయపడ్డారు. ఈనాడు- ఈటీవీ పిలుపు మేరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో వారు భాగస్వాములయ్యారు. మండలంలోని పాకల సముద్ర తీరప్రాంతంలో సర్పంచ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం వ్యర్థాలు, పిచ్చిమొక్కలు తొలగింపు చర్యలు చేపట్టారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, అధికారులు తహసీల్దార్ రవి, ఎంపీడీవో జయమణి, పంచాయతీ రాజ్ ఏఈ శ్రీహరి ఇతర శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొని పాకల తీరంలో కలియ తిరుగుతూ చీపుర పట్టి వ్యర్థాలను తొలగించారు. గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రతీ ఒక్కరూ పారిశుద్ధ్యం నివారణ దిశగా చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరారు.

ఈనాడు ఈటీవీ ఆంధ్రప్రదేశ్

అందరికీ అవగాహన కల్పిస్తాం...



ఈ కార్యక్రమంతో మాలో బాధ్యత మరింత పెరిగింది. దీన్ని భవిష్యత్తు లోనూ ముందుకు తీసుకెళ్తాం. గ్రామాల్లో వ్యర్థ పదార్థాలను రోడ్లపై వేయకుండా చెత్త బుట్టల్లో వేసేలా ప్రజలకు అవగాహన కల్పిస్తాం. పంచాయతీ వాహనాల ద్వారా చెత్తా చెదారాన్ని సంపద కేంద్రాలకు తరలించేలా మహిళలకు అవగాహన కల్పిస్తాం.
– రాజేష్, నితిన్, వంశీ, కళాశాల విద్యార్థులు

భూవాతావరణాన్ని కాపాడుకోవాలి..



ఏటా పెరుగుతున్న వ్యర్థాలతో భూవాతావరణం దెబ్బతింటోంది. దీనికి తోడు ప్రకృతి వైపరీత్యాలతో మానవ మనుగడకు పెనుముప్పు వాటిల్లే అవకాశం లేకపోలేదు. పాకల సముద్ర తీరంలో ఈనాడు-ఈటీవి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన అవగాహన కార్యక్రమంలో మేము భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉంది. – దివ్యశ్రీ, నాగమృధుల, స్మృతి

జలచరాలు మృత్యువాత పడుతున్నాయి..



ఈనాడు- ఈటీవి ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది. తీరం వెంబడి వ్యర్థ పదార్థాలు వేయడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. జలచరాలు మృత్యువాత పడుతున్నాయి. దీనిని అరికట్టేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలి.
– శ్రీనిధి, ఖసిఫా, హిమప్రియ, పీయన్‌సీఏ డిగ్రీ కళాశాల విద్యార్థినులు

ప్లాస్టిక్ వ్యర్థాలను నియంత్రిస్తాం..



ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. దీంతో పుడమికి నష్టం వాటిల్లుతోంది. వాటిని ప్రజలు వినియోగించకుండా అవగాహన కల్పిస్తాం. స్నేహితుల సాయంతో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని కొనసాగిస్తాం. ప్లాస్టిక్‌ను విక్రయించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఈనాడు-ఈటీవి ద్వారా కోరుతున్నాం. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలి. అప్పుడే అనారోగ్యాలు దరిచేరవు.
– ప్రసన్న, భవేష్, పవన్, పీయన్‌సీఏ కళాశాల విద్యార్థులు

మర్రిపూడి అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం



మర్రిపూడి: మొక్కకు మట్టి పోస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారీయా, ఎంపీ మాగుంట

మర్రిపూడి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మర్రిపూడి పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం ఏర్పాటుచేసిన సబ్‌కా యోజన.. సబ్‌కా వికాస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా పాఠశాల వద్ద ఉన్న మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాముల విగ్రహాలకు మంత్రి, జిల్లా కలెక్టర్ అన్సారీయా, ఎంపీ శ్రీనివాసులురెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటుచేసిన గ్రామ సభలో మంత్రి స్వామి మాట్లాడుతూ.. సబ్‌కా యోజన సబ్‌కా వికాస్ కార్యక్రమంలో భాగంగా మర్రిపూడి పంచాయతీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంపిక చేసినట్లు తెలిపారు. మర్రిపూడి ఎస్సీ కాలనీ రూ.15 లక్షలు, గంగపాలెం, రాజుపాలెంకు రూ.15 లక్షలు సీసీరోడ్లు, కాలువలు,. కొండపై నున్న లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం వద్ద సత్రాల సమీపంలో మరో రూ.50 లక్షలతో సీసీరోడ్డు మంజూరు చేశామన్నారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టాక నియోజకవర్గంలో రూ.18 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ అన్సారీయా మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధికి ఏ విధంగా చర్యలు తీసుకుంటామో, మర్రిపూడి అభివృద్ధికి అదే విధంగా కృషి చేస్తామన్నారు. అనంతరం పంచాయతీలో 75 ఏళ్లు పైబడిన వృద్ధులను వేదిక వద్దకు పిలిపించి సన్మానించారు. సీఈవో చిరంజీవి, డీపీవో ఉషారాణి, సర్పంచి భాస్కర్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. ● **టంగుటూరు:** జమ్ములపాలెం గ్రామ తెదేపా నాయకులు మక్కెన యానాదయ్య అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం గ్రామంలోని ఆయన భౌతిక కాయాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాలవీరాంజనేయస్వామి, ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, పార్టీ సీనియర్ నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

రోడ్డెక్కిన మురుగు

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి పట్టణంలో బుధవారం సాయత్రం ఓ మోస్తరు వర్షం కురవడంతో రోడ్లన్నీ మురుగుమయ్యాయి. ఎక్కడికక్కడే కాల్వలు ఆక్రమణలు.. కాల్వల్లో నెలల తరబడి వ్యర్థాలు తొలగించకపోవడంతో వర్షపు నీరంతా మురుగులా రోడ్ల మీదకు చేరింది. ప్రధానంగా పామూరు బస్టాండ్, పోలీస్‌స్టేషన్, అంబేడ్కర్ బొమ్మ, బొడ్డు చావిడి సెంటర్, గార్లపేట రోడ్డు తదితర ప్రాంతాల్లో మురుగునీరు పారి ప్రజలు కాలు కదపలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మురుగు కాల్వలను శుభ్రం చేయించి ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై కమిషనర్ దానియేల్ జోసెఫ్‌ను వివరణ కోరగా.. కాల్వలు శుభ్రం చేయిస్తామన్నారు.



పోలీస్ స్టేషన్ వద్ద రోడ్డు మీద ప్రవహిస్తున్న మురుగునీరు



బొడ్డు చావిడి సెంటర్ రోడ్డులో తటాకాన్ని తలపిస్తూ..

మద్యం వద్దు.. మంచి నీళ్లు కావాలంటూ నిరసన



కనిగిరి: గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు

కనిగిరి, న్యూస్‌టుడే: మద్యం వద్దు. . మంచినీళ్లు కావాలంటూ ఐద్వా ప్రతినిధులు కోరారు. బుధవారం పోలీస్ స్టేషన్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద వారు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకురాలు బషీరా మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వం మద్యం విక్రయించి ప్రాణాలతో చెలగాట మాడిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే విధానాన్ని కొనసాగిస్తుందని తెలిపారు. మద్యపాన నిషేధం అమలు చేయాలని కోరారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు శాంతాకుమారి, రత్తమ్మ, ఎలీషమ్మ తదితరులు పాల్గొన్నారు. ● **పామూరు:** తెదేపా కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం విధానం రద్దు చేయాలని ఐద్వా మండల కార్యదర్శి ఎస్టీ.ఖాదర్‌నిషా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

దోపిడీ రహిత సమాజమే సీపీఎం లక్ష్యం

దర్శి, న్యూస్‌టుడే: దోపిడి నిర్మూలన సమాజం కోసమే సీపీఎం పోరాడుతుందని సీపీఎం జిల్లా నాయకులు కంకణాల ఆంజనేయులు తెలిపారు. దర్శి సందువారిపాలెం శాఖ మహాసభలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ముందుగా పార్టీ జెండాను సీనియర్ నాయకులు సందు వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భగా ఆంజనేయులు మాట్లాడుతూ.. దర్శి పట్టణంలో పారిశుద్ధ్యం, తాగునీటి వ్యవస్థ అధ్వానంగా ఉందని, వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం శాఖ నూతన కమిటీని ఎంపిక చేశారు. కార్యదర్శిగా నారాయణ, మహిళా శాఖ కార్యదర్శిగా తాండవ లక్ష్మి, ఇతర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు రంగారావు, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.



సీపీఎం జెండా ఆవిష్కరిస్తున్న సీనియర్ నాయకులు సందు వెంకటేశ్వరరావు

నేటి నుంచి దసరా బ్రహ్మోత్సవాలు

కనిగిరి, న్యూస్‌టుడే: జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన కనిగిరి వెంకటేశ్వర దేవస్థానంలో గురువారం నుంచి దసరా బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 9 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు శ్రీనివాస సమేత శ్రీదేవి, భూదేవి దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా రోజు కొక భక్తి కార్యక్రమాన్ని దేవస్థానం కమిటీ ఏర్పాటు చేసింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు స్వామి వారికి సామూహిక కల్యాణాలు, సాయంత్రం వేళ శ్రీవారికి పల్లకి సేవ నిర్వహిస్తారు. ఇప్పటికే దేవస్థానాన్ని రంగులు వేసి ముస్తాబు చేశారు. ప్రతి రోజు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. ● **పామూరు:** పామూరులోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం, శ్రీ వల్లీ భుజంగేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయాల కమిటీ ప్రతినిధులు తెలిపారు.




ముస్తాబైన వేంకటేశ్వర దేవస్థానం

మద్యం సీసాల స్వాధీనం

తాళ్లూరు: తాళ్లూరులో మద్యం గొలుసు దుకాణంపై బుధవారం ఎస్సై ఎస్.మల్లిఖార్జునరావు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొన్నారు. విక్రేత కాటం వెంకటరెడ్డిను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.
కురిచేడు: అక్రమంగా మద్యం అమ్ముతున్న ఓ వ్యక్తి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై శివ తెలిపారు. కురిచేడు గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీం బుధవారం తన న్యూడిల్స్ దుకాణంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నాడనే సమాచారంతో సిబ్బందితో వెళ్లి తనిఖీ చేశారు. 8మద్యం సీసాలు గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశారు.
పామూరు: పామూరులోని కేబీ థియేటర్ వద్ద విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన ఇతర రాష్ట్రాలకు చెందిన 19 మద్యం సీసాలను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపారు. మద్యం సీసాలను కలిగి ఉన్న పామూరుకు చెందిన నవీన్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.
జూదరుల అరెస్టు: కనిగిరి, న్యూస్‌టుడే: మండలంలోని వాగుపల్లి సమీపంలోని పొలాల్లో జూదం ఆడుతున్న అయిదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై టి.శ్రీరామ్ బుధవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 2080 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.
కోడి పందాల నిర్వాహకులు...: వెలిగండ్ల: మండలంలోని కొటాలపల్లి సమీపంలోని పొలాల్లో కోడి పందాలు నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై మధుసూదన్‌రావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2300 నగదును, ఒక కోడి పుంజును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి



దర్శిలో గాంధీజి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న భాజపా నాయకులు



కనిగిరి: మానవహారం నిర్వహిస్తూ..



తాళ్లూరు పోలీసుస్టేషన్‌లో

న్యూస్‌టుడే బృందం: దర్శి, కనిగిరి, కొండపి నియోజకవర్గాల్లోని వివిధ మండలాల్లో మంగళవారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు, మహాత్మా గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ... భారత స్వతంత్ర పోరాటంలో జాతిపిత సేవలు మరువలేమని కొనియాడారు. అహింసా మార్గంలో బ్రిటిష్ పాలకులను తరమికొట్టారని పేర్కొన్నారు. గాంధీజీ అడుగుజాడల్లో అందరూ నడవాలన్నారు. యువతకు ఆయన్ను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, వైద్య సిబ్బంది, పొదుపు మహిళలు, కళాశాల విద్యార్థినులు పామూరు బస్టాండ్‌లో మానవహారం నిర్వహించారు. శ్రీవైష్ణవి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్లకార్డులతో స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ నిర్వహించారు. దర్శిలో పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. ● కురిచేడు మండలం పడమర వీరాయపాలెంలోని కరుణ ఆశ్రమం వృద్ధులకు లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు, పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు.



పామూరులో..



టంగుటూరు: నెహ్రూ, గాంధీ, ప్రకాశం పంతులు విగ్రహాలకు నివాళులర్పించిన పంచాయతీ కార్యవర్గం, నాయకులు



దర్శి: కరుణ ఆశ్రమంలో వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ సభ్యులు

కార్మికులకు బూట్ల పంపిణీ

దర్శి(రామచంద్రాపురం), న్యూస్‌టుడే: దర్శి మండలం రామచంద్రాపురంలో బుధవారం జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామసభ జరిగింది. ముందుగా గాంధీజి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సభలో గ్రామంలో ఉపాధి కార్యక్రమంలో చేయవలసిన పనులు, మొక్కల పెంపకం తదితర విషయాల గురించి చర్చించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు బూట్లు పంపిణీ చేశారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలకు డిమాండ్

కనిగిరి, న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో కనిగిరి పట్టణంలో ప్రైవేటు పాఠశాలలు తరగతులు నిర్వహిస్తుండటంపై ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం, ప్రైవేటు ఉపాధ్యాయ సంఘం నాయకులు బుధవారం స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రెండు సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేసిన ప్రైవేటు పాఠశాలల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీటీఎల్‌యూ పి.రషీద్, ఏఐఎస్ఎఫ్ నాయకులు పవన్ కల్యాణ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నూకసానిని కలిసిన తెదేపా నేతలు

తాళ్లూరు: రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమతులైన తెదేపా నేత నూకసాని బాలాజీని బుధవారం పలువురు తెదేపా ప్రధాన, ఇతర నాయకులు కలిశారు. ఒంగోలులోని ఆయన కార్యాలయానికి దర్శి నియోజకవర్గం తెదేపా నాయకుడు, హర్షిణి విద్యాసంస్థల అధినేత గోరంట్ల రవికుమార్ నాయకులు వెళ్లి బాలాజీకి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

కొత్త కళ.. బస్సులొచ్చిన వేళ

■ తీరనున్న ప్రజల వెతలు ■ దూర ప్రాంతాల సర్వీసులకు ప్రాధాన్యం

■ పూర్వ వైభవం సంతరించుకోనున్న కనిగిరి ఆర్టీసీ డిపో



కనిగిరి డిపోకు కేటాయించిన కొత్త బస్సులు

డిపో పేరు	కనిగిరి
మొత్తం బస్సులు	120
వీటిలో కొత్తవి	44
రోజు బస్సులు ప్రయాణించే దూరం	47 వేల కిలోమీటర్లు
రోజుకు రాబడి	రూ.20 లక్షలు
కండక్టర్లు.. డ్రైవర్లు, ఇతర సిబ్బంది	440

కనిగిరి, న్యూస్‌టుడే:

కనిగిరి ఆర్టీసీకి కొత్త బస్సులొచ్చాయి. దసరా.. సంక్రాంతి... వినాయకచవితి.. శ్రీరామనవమి లాంటి పండుగలు, ప్రత్యేక రోజుల్లో ప్రైవేటు వాహనాలకు ఆశ్రయించే వారిని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా దూరప్రాంత సర్వీసుల కోసం వీటిని కేటాయించనున్నారు. గత మూడు నెలల వ్యవధిలోనే రెండు విడతలుగా కనిగిరి ఆర్టీసీ డిపోకి 44 బస్సులను కేటాయించారు. త్వరలో మరికొన్ని వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

వైకాపా పాలనలో నిర్వీర్యం..

కనిగిరి ఆర్టీసీ డిపోకి రాష్ట్రంలో ప్రత్యేకత ఉంది. ఆదాయంలో మేటిగా ఉండే ఈ డిపోని గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. అయిదేళ్ల పాలనలో మూడుసార్లు ఛార్జీలు పెంచి ప్రయాణికులపై భారం మోపిందే తప్ప కనీసం మౌలిక వసతులు కల్పించిన దాఖాలాలు లేవు. ఒక్క కొత్త బస్సు ఏర్పాటు చేయకపోగా కాలం చెల్లించిన వాహనాలనే నడిపించింది. ఏ బస్సు చూసిన డీజిల్ కారడం, మధ్యలోనే ఆగి పోవడం, పుట్ పాత్‌లు దెబ్బ తినడం, దుమ్ము ధూళితో కూడి ఉండటంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. క్రమంగా చాలా మంది ఆర్టీసీ దూరమయ్యారు. ఫలితంగా తెలంగాణ, హైదరాబాద్, తమిళనాడు, కర్ణాటక, విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్టణం తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు ప్రైవేటు బస్సులను ఆశ్రయించేవారు. దాంతో డిపోకు ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది.

కాలం చెల్లిన వాటికి తిలోదకాలు..

2024 ఎన్నికల ముందు కనిగిరి ఆర్టీసీ డిపోలో 105 బస్సులుండేవి. అందులో చాలావరకు కాలం చెల్లినవే. కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే వాటికి తిలోదకాలు వదిలింది. కొన్ని ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, పల్లెవెలుగులు మొత్తం 44 నూతన బస్సులు కేటాయించింది. ప్రస్తుతం ఇవన్నీ విజయవాడ, హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై ప్రాంతాలకు నడుస్తుండగా కొన్ని పల్లె వెలుగు బస్సులు మాత్రం నియోజకవర్గంలో కొన్ని గ్రామాలకు, పొదిలి, ఒంగోలు, కందుకూరుకు తిరుగుతున్నాయి. దీంతో పాటు తిరుమల బ్రహ్మోత్సవాలు, కార్తిక మాసాల్లో తిరుమల, శ్రీశైలం, ఇతర పుణ్యక్షేత్రాలకు కొత్త బస్సులు తిప్పనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం 120 బస్సులు నడుపుతున్నామని.. ప్రయాణికుల సంఖ్య పెంచడం కోసం ప్రైవేటు వాహనాల మించి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీమన్నారాయణ తెలిపారు. ఇప్పటికే ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆయన వివరించారు. ఆర్టీసీలో ప్రయాణికులకు భద్రత ఉంటుందని తెలిపారు.



నూతన ఆర్టీసీ బస్సుల్లో సీటింగ్

ఒంగోలు

• ఒంగోలు • సంతనూతలపాడు

పారిశుద్ధ్య కార్మికులే నిజమైన హీరోలు



పురస్కారాలు పొందిన కార్మికులతో మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ప్రజారోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమించే పారిశుద్ధ్య కార్మికులు నిజమైన హీరోలని రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఉత్తమ పారిశుద్ధ్య కార్మికుల పురస్కారాల ప్రదానోత్సవంలో మాట్లాడారు. మహాత్ముడి స్ఫూర్తితో స్వచ్ఛ గ్రామాల ఆవిష్కరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ... తాను నమ్మిన సిద్ధాంతాలను ఆచరించి చూపిన మహనీయుడు బాపూజీ అని కీర్తించారు. 25 మంది కార్మికులను సత్కరించారు. 'స్వచ్ఛత హీ సేవ' చిత్ర ప్రదర్శనను తిలకించారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మేయర్ సుజాత, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.



చీమకుర్తి: రక్తదానం చేస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు



మద్దిపాడు: రాచవారిపాలెంలో మొక్క నాటుతున్న జనసేన నాయకులు

మహాత్ముడికి నివాళి : జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకను ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. బాపూజీ విగ్రహాలు, చిత్రపటాల వద్ద అంజలి ఘటించారు. ఆయన మార్గం అందరికీ అనుసరణీయమని వక్తలు కీర్తించారు. – న్యూస్‌టుడే బృందం



గాంధీ విగ్రహం వద్ద అంజలి ఘటిస్తున్న తెదేపా నాయకులు



ఒంగోలు: బాపూజీ మార్కెట్ పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు

అందరూ సన్మార్గంలో నడవాలి



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ, చిత్రంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి దీనా, ఇతర అధికారులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఖైదీలు నేర ప్రవృత్తిని వీడి సన్మార్గంలో నడవాలని జేసీ రోణంకి గోపాలకృష్ణ సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం కల్పిస్తున్న విద్య, వైద్య, వృత్తి నైపుణ్య శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కారాగారంలో బుధవారం నిర్వహించిన ఖైదీల సంక్షేమ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. పేద ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తున్నట్లు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.దీనా తెలిపారు. ప్రభుత్వ వైద్యశాల పర్యవేక్షకురాలు జి.దుర్గాదేవి, ఏఎస్పీ శ్రీధర్‌రావు, కారాగార పర్యవేక్షణాధికారి పి.వరుణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎంపీ మాగుంట

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబును ఉండవల్లిలోని నివాసంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి బుధవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. గృహ, పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా నియమించడంపై కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీతో రవిశంకర్ భేటీ : ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల జనసేన పార్టీలో చేరిన రవిప్రియ సంస్థల అధినేత కంది రవిశంకర్... ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని రామనగర్‌లోని కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే:

?: మంగమూరు రోడ్డు మర్రిచెట్టు సమీపంలోని ప్రగతినగర్‌లో వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉంది. వాటి అరుపులతో రాత్రివేళ నిద్రకు దూరమవుతున్నాం. – ఓబుల్‌రెడ్డి, ఉద్యోగి

✓: త్వరలో కుక్కల్ని పట్టి సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.
– ఎన్.పిచ్చయ్య, శానిటరీ సూపర్‌వైజర్

?: రాజపానగల్‌రోడ్డు 7-8 లైన్ల మధ్య పైపులైను లీకై గత కొద్ది నెలలుగా తాగునీరు వృథాగా పోతోంది. – స్థానికులు

✓: లీకు అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం.
– చంద్రయ్య, మున్సిపల్ ఇంజినీర్

గుంత పూడ్చారు

స్పందనకు వందనం

మద్దిపాడు, న్యూస్‌టుడే: పడమరపాలెం నుంచి ఇందిరమ్మ కాలనీకి వెళ్లే మార్గంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద... పైపులైను మరమ్మతులకు గుంత తవ్వారు. పనులు పూర్తయినా తిరిగి కప్పకపోవడంతో... నీరు చేరి ప్రమాదకరంగా మారింది. ఈ విషయమై 'పనులు చేశారు... గుంత వదిలేశారు' శీర్షికన 'ఈనాడు'లో మంగళవారం ప్రచురితమైన చిత్రకథనానికి అధికారులు స్పందించి గుంతను పూడ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాబు, పంచాయతీ కార్యదర్శి అశాలక్ష్మి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ భవాని పనులను పర్యవేక్షించారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: నగరంలోని శ్రీ ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో గురువారం నుంచి ఈ నెల 12 వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో రావెళ్ల శివశంకర్ తెలిపారు. ప్రతి రోజూ భక్తి సంగీత విభావరి, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు ఉంటాయని చెప్పారు. 12న ఉదయం తొమ్మిది గంటలకు శ్రీవారి కల్యాణం... సాయంత్రం ఆరు గంటలకు పార్వేట ఉత్సవం ఉంటాయన్నారు. భక్తులంతా పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ● **హరిహర క్షేత్రంలో...:** చీమకుర్తి: హరిహర క్షేత్రంలో గురువారం నుంచి ఈ నెల 13 వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతాయని శిద్దా వెంకటేశ్వర్లు వెంకట సుబ్బమ్మ ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. అమ్మవారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు. నగరేశ్వర స్వామి, ఇసుకవాగు శివాలయాల్లోనూ ఏర్పాట్లు చేశారు.

చెత్త పనుల్లోనూ కక్కుర్తి

- రూ.కోట్లు వెచ్చించినా కానరాని ప్రయోజనం
- గత పాలకుల తీరుతో నేడు మరిన్ని ఇక్కట్లు

65 వేల టన్నులు: 2020 నాటికి డంపింగ్ యార్డులో ఉన్న చెత్త
రూ.5.05 కోట్లు: పూర్తిగా శుభ్రం చేసేందుకు ఏజెన్సీకి చెల్లించిన మొత్తం
మే 2024: పనులు పూర్తయ్యాయని సంస్థ వారు ఖాళీ చేసిన నెల
60 వేల టన్నులు: ప్రస్తుతం నిల్వ ఉన్న వ్యర్థాలు (అంచనా)



యార్డులో గుట్టల్లా పేరుకుపోయి రహదారి పైకి విస్తరించిన వ్యర్థాలు

న్యూస్‌టుడే – ఒంగోలు నగరం

ప్రజారోగ్యంతో ముడిపడిన వ్యర్థాల నిర్వహణలోనూ గత వైకాపా పాలకులు చేతివాటం చూపారు. డంపింగ్ యార్డులో చెత్త ఖాళీ చేసేందుకు రూ.కోట్లు ఖర్చు చేసినట్లు బిల్లులు చేసుకున్నా... అక్కడి పరిస్థితిలో మార్పులేకపోవడమే ఇందుకు నిదర్శనం. వారి నిర్లక్ష్యంతో ఇప్పుడు మరిన్ని కొత్త సమస్యలు తలెత్తుతున్నాయి.

పనుల్లోనూ తీవ్ర జాప్యం... : నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ సూచన మేరకు గత ప్రభుత్వ హయాంలో ప్రధాన నగరాలు, పట్టణాల్లోని డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయిన చెత్త నిల్వలు శుభ్రం చేసేందుకు ప్రత్యేక ప్రాజెక్టు చేపట్టారు. రాష్ట్రస్థాయిలో టెండర్లు పిలవగా ఒంగోలుకు సంబంధించి... విజయవాడకు చెందిన ఓ ఏజెన్సీ రూ.5.05 కోట్లకు పనులు దక్కించుకుంది. నిబంధనల ప్రకారం గుత్తికొండవారిపాలెం యార్డులోని చెత్తను పూర్తిగా శుభ్రం చేయాలి. 2020లో టెండరు దక్కించుకున్న సదరు ఏజెన్సీ వారు... యంత్రాలు సమకూర్చుకుని పనిలో దిగేందుకు ఏడాది సమయం తీసుకున్నారు. రెండేళ్లలో పూర్తికావాల్సిన వ్యర్థాల నిర్వహణను అసెంబ్లీ ఎన్నికల వరకు సాగదీశారు. ఈ ఏడాది మేలో తమ పనులు పూర్తయ్యాయంటూ యంత్రాలను తీసుకుపోయారు. యార్డులో మాత్రం చెత్తకుప్పలు అలానే దర్శనమిస్తున్నాయి.



పొగ కమ్మేయడంతో వాహనదారుల అవస్థలు

పర్యవేక్షణ మరిచి బిల్లులకే ప్రాధాన్యం...

పనులు అప్పగించినప్పుడు యార్డులో 65 వేల టన్నుల వ్యర్థాలు ఉన్నట్లు అంచనా వేశారు. తడి, పొడి చెత్తతో పాటు ఇనుము, ప్లాస్టిక్ వ్యర్థాలను వేటికవి విభజించి అధికారులు పర్యవేక్షణలో తూకం వేసి తరలించాలి. పనికొచ్చే ప్లాస్టిక్ వ్యర్థాలను గుంటూరులోని ఎనర్జీప్లాంట్‌కు పంపాలన్నది ఒప్పందం. ఈ పనులను కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు, కమిషనర్, పాలకవర్గం పెద్ద పర్యవేక్షించాలి. ఎన్ని లారీల చెత్త యార్డుకు వచ్చింది, రోజుకు ఎంత శుభ్రం చేశారు, ఎనర్జీప్లాంట్‌కు ఎంత పంపారన్నది వీరు పరిశీలించాలి. అదేమీ లేకుండా వర్క్ ఇన్‌స్పెక్టర్ల మీద వదిలేశారు. బిల్లులపై సంతకాలు మాత్రం చేసి ఉభయతారకంగా లబ్ధిపొందారన్న ఆరోపణలు ఉన్నాయి. తడి చెత్తను వర్మీకంపోస్టు యార్డుకు పంపి అక్కడ తయారైన ఎరువును రైతులకు రాయితీపై అందజేయాలి. అయినప్పటికీ మామిడిపాలెంలోని వర్మీకంపోస్టు యూనిట్‌నే వినియోగంలోకి తేలేదు.

తరగని వ్యర్థాల గుట్టలు...

యార్డులోని మొత్తం వ్యర్థాలను శుభ్రం చేసినట్లు లెక్కలు చూపి బిల్లులు తీసుకున్నా... అక్కడి చెత్త కుప్పలు మాత్రం అలానే ఉన్నాయి. ఒకసారి యార్డు శుభ్రం చేశాక మళ్లీ అక్కడ వ్యర్థాలు పేరుకుపోకుండా చూడాలి. గృహస్థుల నుంచే తడి, పొడి, హానికారక వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి... తడి చెత్తను వర్మీకంపోస్టు యూనిట్‌కు, పొడి చెత్తలో రీసైక్లింగ్‌కు పనికొచ్చేవాటిని పక్కకు తీసి మిగిలిన వాటిని ఎనర్జీ సంస్థకు పంపాలి. ఈ ప్రక్రియా గాలికొదిలేశారు. దీంతో అసలు లక్ష్యం నెరవేరకపోగా... యార్డులో వ్యర్థాలు మరింతగా పేరుకుపోయి రోడ్డుపైకి విస్తరించి మరిన్ని సమస్యలు తలెత్తుతున్నాయి. పైపెచ్చు చెత్తకు నిప్పుపెడుతుండడంతో పొగ కమ్మేసి అటుగా వెళ్లేవారికి ఊపిరాడని పరిస్థితి తలెత్తుతోంది.

వేతన బకాయిలు చెల్లించాలని వినతి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: సమగ్ర శిక్ష అభియాన్ పరిధిలో కేజీబీవీల్లో పనిచేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల సిబ్బందికి... ఆగస్టు, సెప్టెంబరు నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కేజీబీవీ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు రత్నమాలినీదేవి కోరారు. కేజీబీవీల్లో 604 పోస్టుల భర్తీకి ప్రకటన ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియకు ముందే బదిలీల ప్రక్రియ చేపట్టాలని కోరారు. సీఆర్‌టీగా ఉన్నవారితో పీజీటీ పనులు చేయిస్తూ... ఉపాధ్యాయులను బాధ్యులను చేసి మెమోలు ఇవ్వడం సరికాదన్నారు.

ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా నగర సంకీర్తన



కార్యక్రమంలో పాల్గొన్న వీర మహిళలు, జనసేన నాయకులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: సనాతన ధర్మ పరిరక్షణకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా జనసేన వీరమహిళలు, తెలుగు మహిళలు బుధవారం నగర సంకీర్తన నిర్వహించారు. సమతానగర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి అద్దంకి బస్టాండ్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వరకు ఇది సాగింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, నాయకులు కంది రవిశంకర్, కల్యాణ్ ముత్యాల, బొందిల శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. లడ్డూను కల్తీ నెయ్యితో అపవిత్రం చేసి కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీశారని విమర్శించారు. దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. పార్టీ నాయకులు నాగిశెట్టి బ్రహ్మయ్య, చిట్టెం ప్రసాద్, చనపతి రాంబాబు, రాయని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి సలహాలు, సూచనలివ్వండి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047 పేరిట చేపడుతున్న సర్వేలో ప్రజలంతా భాగస్వాములై రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా విజ్ఞప్తి చేశారు. విధానాల రూపకల్పనలో ఏయే రంగాలకు ప్రాధాన్యమివ్వాలన్న విషయమై సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వేలో పాల్గొన్నవారు ముఖ్యమంత్రి చంద్రబాబు సంతకంతో కూడిన ప్రశంసాపత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉపాధి పనుల సద్వినియోగంతో ప్రయోజనం

ఒంగోలు గ్రామీణం, కొత్తపట్నం, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకం కింద నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యమివ్వనున్నట్లు ఈవోఆర్డీ బాలచెన్నయ్య తెలిపారు. ఒంగోలు మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఉపాధిహామీ గ్రామసభలు నిర్వహించారు. పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొత్తపట్నం మండలం మోటుమాలలో నిర్వహించిన సభలో ఈవోఆర్డీ వేణు పాల్గొని... పనుల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు.

విశాఖ ఉక్కును పరిరక్షించాలని దీక్ష

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద బుధవారం నిరసన దీక్ష చేపట్టారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ... వేలాది మందికి ఉపాధి చూపుతున్న సంస్థను ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఇటీవల నాలుగు వేల మంది ఒప్పంద కార్మికులను తొలగించడం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటుపరమైతే రాష్ట్రంలోని పలు ఇతర సంస్థలపైనా ఆ ప్రభావం ఉంటుందన్నారు. కార్మిక సంఘాల నాయకులు కాలం సుబ్బారావు, కె.వెంకటేశ్వర్లు, ఒంగోలు అభివృద్ధి వేదిక అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, జి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని తీవ్రగాయాలు

మద్దిపాడు, న్యూస్‌టుడే: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మద్దిపాడుకు చెందిన పర్వతరెడ్డి హనుమంతరావు బుధవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో గ్రోత్‌సెంటర్ కూడలిలో ఆటో దిగారు. గుంటూరు వెళ్లే వైపు రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో నగరంలోని ప్రైవేటు ఆసపత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: చేకూరపాడులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్సై బి.శ్రీకాంత్ పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం రావడంతో శనివారం అర్ధరాత్రి సమయంలో దాడులు చేశారు. వాహనాన్ని జప్తు చేసి కేసు నమోదు చేశారు.

కల్తీ నెయ్యి వినియోగంపై నేడు ఆందోళన

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగాన్ని నిరసిస్తూ నగరంలో గురువారం ఉదయం 9.30 గంటలకు చేపడుతున్న ప్రదర్శనకు అందరూ తరలిరావాలని విశ్వ హిందూ పరిషత్ మండల అధ్యక్షుడు సుబ్బారాయుడు కోరారు. ర్యాలీ అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు.



ఆందోళనలో పాల్గొన్న మహిళా సంఘాల ప్రతినిధులు

మద్యం విధానంపై నిరసన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: నూతన మద్యం పాలసీని తక్షణమే రద్దు చేయాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పద్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు పీవోడబ్ల్యూ, ఐద్వా, మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో అద్దంకి బస్టాండ్‌లోని పెట్రోలు బంకు నుంచి బాపూజీ దుకాణ సముదాయంలోని గాంధీ విగ్రహం వరకు బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేసిన రోజుల్లో రాష్ట్రంలో నేరాల రేటు తగ్గడంతో పాటు... కుటుంబాల ఆదాయం పెరిగి ప్రజల కొనుగోలు శక్తి పెరిగిన విషయాన్ని గుర్తుచేశారు. మద్యం అమ్మకాలతో ప్రజల ఆదాయాన్ని లూటీ చేసి గుత్తేదారులకు కట్టబెట్టడం తప్ప... ప్రజా సంక్షేమానికి చేస్తున్నదేమీ లేదని ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి విమర్శించారు. ఏపీ మహిళా సమాఖ్య కార్యదర్శి ఎన్.విజయ, ఆయా సంఘాల ప్రతినిధులు జి.ఆదిలక్ష్మి, బి.రాజ్యలక్ష్మి, బి.గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాపూజీ విగ్రహానికి వినతి : సంతనూతలపాడు, న్యూస్‌టుడే: కొత్త మద్యం పాలసీని రద్దు చేయాలని ఐద్వా మండల కార్యదర్శి ఎన్.మాలతి డిమాండ్ చేశారు. బస్టాండ్ సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఐద్వా ప్రతినిధులు కె.బుజ్జి, మేఘన, జేవీవీ జిల్లా నాయకులు కోదాటి కోటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ సేవలు మరింత విస్తృతం



ఆర్థికసాయం అందజేస్తున్న వాసవీ, మహిళా క్లబ్‌ల ప్రతినిధులు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: వాసవీ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేయనున్నట్లు క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పేర్ల సత్యనారాయణ తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా వాసవీ, మహిళా క్లబ్‌ల ఆధ్వర్యంలో... మద్దులూరుకు చెందిన చీడెళ్ల నాగేశ్వరరావు ఇంటి మరమ్మతులకు రూ.70 వేల సాయం అందజేశారు. చెన్నకేశవస్వామి దేవస్థానానికి మురళీకృష్ణ, బాలజీలు సమకూర్చిన బల్లలను ప్రారంభించి, మొక్కలు నాటారు. చలువాది రాము సమకూర్చిన బియ్యాన్ని పేదలకు పంపిణీ చేశారు. క్లబ్ విద్యా నిధికి జలదంకి బాలాజీ, సుబ్రహ్మణ్యం, పబ్బిశెట్టి శ్రీనివాసరావులు రూ.11 వేలు అందజేశారు. వాసవీ మాతకు పూజలు, గాంధీ, పొట్టి శ్రీరాముల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్లబ్ ప్రతినిధులు ఎ.శ్రీనివాసరావు, రఘు, టంగుటూరి రంగస్వామి, అమరా సత్యనారాయణ, వీఎన్ ప్రసాదరావు, వి.వి.శేషారావు, సీహెచ్ చంద్రావతి, రాము, ఎస్.జయశ్రీ, పి.సుధాకర్, జి.శ్రీలక్ష్మి, సుబ్బారాయుడు, జి.శరత్‌బాబు, ఎస్.వి.సుబ్బారావు, పబ్బిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఉద్యమ కార్యాచరణ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆత్మ గౌరవం, సమానత్వం, కుల నిర్మూలన కోసం సమరశీల ఉద్యమాలు నిర్వహించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురామ్ పేర్కొన్నారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఒంగోలులోని కార్యాలయంలో బుధవారం జెండా ఆవిష్కరించారు. ఈ నెల పదో తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక చట్టంతో పాటు... 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, చర్మకారులకు పింఛను తదితరాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు చీకటి శ్రీనివాసరావు, అట్లూరి రాఘవులు, టి.మహేష్, సయ్యద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యావేత్త అంజిరెడ్డికి నివాళి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: విద్యా రంగానికి బూచి అంజిరెడ్డి చేసిన సేవలు ఎనలేనివని ప్రైవేట్ అధ్యాపకులు, ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం నిర్వహించిన బీఏకేఆర్ విద్యాసంస్థల పూర్వ ఛైర్మన్ అంజిరెడ్డి వర్ధంతి సభలో నూకతోటి రవికుమార్ మాట్లాడారు. ఎందరో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, బ్రహ్మయ్య, జాన్ శామ్యూల్, సాల్మన్, చిరంజీవి, సాయిరాజేష్ తదితరులు పాల్గొన్నారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

సుబ్బారావు మృతి తీరని లోటు

చీమకుర్తి, న్యూస్‌టుడే: సీనియర్ తెదేపా నాయకులు ముప్పూరి సుబ్బారావు మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ సంతాపం తెలిపారు. ఆయన మృతదేహాన్ని బుధవారం సందర్శించి నివాళులర్పించారు. ఆయన తనయుడు చలమయ్య, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. డాక్టర్ చెరుకూరి వెంకటేశ్వర్లు, రఘుకిరణ్, మన్నం ప్రసాదరావు, గొల్లపూడి సుబ్బారావు, గొట్టిపాటి రాఘవరావు, కాట్రగడ్డ రమణయ్య, రాంబాబు, సుబ్బారావు, రామబ్రహ్మం, హనుమంతరావు తదితరులు నివాళులర్పించారు.

చండ్రపాడు ఎంపీటీసీ సభ్యుడి మృతి

చీమకుర్తి: చండ్రపాడు ఎంపీటీసీ సభ్యుడు వాకా అంజిరెడ్డి (70) బుధవారం కన్నుమూశారు. దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, వైకాపా నాయకులు పమిడి వెంకటేశ్వర్లు, శేఖర్‌రెడ్డి తదితరులు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

సంబరాలకు సన్నద్ధం





గురువారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అమ్మవారి విగ్రహాల ఏర్పాటుకు ఆయా కమిటీల వారు భారీగా ఏర్పాట్లు చేశారు. ప్రతిమల కొనుగోలుకు వచ్చిన వారితో బుధవారం సాయంత్రం సందడి నెలకొంది. పూజాదికాలు నిర్వహించి మండపాలకు విగ్రహాలను తరలించారు. మద్దిపాడు మండలం కొష్టాలు వద్ద జాతీయ రహదారి పక్కన తయారీదారులు తీర్చిదిద్దిన అమ్మవారి రూపాలివి. – ఈనాడు, ఒంగోలు



శుభ్రత పనుల్లో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

తీరంలో విద్యార్థుల శ్రమదానం

కొత్తపట్నం, న్యూస్‌టుడే: ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకాన్ని నిషేధించి... పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి కమల్‌సా పేర్కొన్నారు. స్వచ్ఛత హీ సేవలో భాగంగా బుధవారం... కొత్తపట్నం జడ్పీ ఉన్నత పాఠశాల, క్విస్ కళాశాల విద్యార్థులు పల్లెపాలెం తీరంలో శుభ్రత పనులు చేపట్టారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలని కోరారు. స్టెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ, క్విస్ కళాశాల ప్రధానాచార్యుడు హనుమంతరావు పాల్గొన్నారు. తీరంలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించారు.